FOR ADS.......
ఆకాంక్ష
CONTACT:
8333818121

TGTEL/25/A1964
తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక

విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్, సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
ఆకాంక్ష
akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :175 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజీలు : 08, వెల. 5రూ/ శనివారం- 14 - ఫిబ్రవరి - 2026

# హైదరాబాద్‌లో పార్కుల కబ్జాలపై హైడ్రా ఉక్కుపాదం



- ఒకేరోజు రూ.34 కోట్ల విలువైన 3041 గజాల భూముల స్వాధీనం
- భాగ్యలక్ష్మి కాలనీలో 6 పార్కులు, గుడిమల్కాపూర్‌లో ఒక పార్కుకు విముక్తి
- హైడ్రా చర్యలతో స్థానికుల సంబరాలు, భారీ ర్యాలీలు
- ప్రజావాణి ఫిర్యాదులపై కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో వేగంగా స్పందన

హైదరాబాద్ నగరంలో ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన పార్కుల స్థలాల కబ్జాపై హైడ్రా ఉక్కుపాదం మోపింది. ప్రజలకు ప్రాణవాయువును అందించే పచ్చని ప్రదేశాలను కాపాడేందుకు నడుం బిగించింది. శుక్రవారం ఒక్కరోజే రెండు వేర్వేరు ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించి సుమారు రూ. 34.12 కోట్ల విలువైన 3,041 గజాల పార్కు స్థలాలను కబ్జాదారుల చెర నుంచి విడిపించింది. హైడ్రా తీసుకున్న ఈ చర్యలతో మిగతా..2లో

# వందేమాతరం' పూర్తి గీతాన్ని పంచుకున్న విజయసాయిరెడ్డి...



- పూర్తి 'వందేమాతరం' పాడాల్సిందేనన్న విజయసాయిరెడ్డి
- సగం గీతం పాడటం బానిసత్వమేనని వ్యాఖ్య
- విదేశీ మతాల కోసం మన సంస్కృతిని వదులుకోవద్దని పిలుపు
- పూర్తి గీతాన్ని ఆలపించాలన్న కేంద్రం నిర్ణయాన్ని స్వాగతించాలని సూచన

హైదరాబాద్: ఇప్పటివరకు మనం పాడుతున్న వందేమాతరం గీతం సగమేనని తెలుసా?... అయితే పూర్తి గీతం ఎలా ఉంటుందో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి తన ట్వీట్ లో పంచుకున్నారు. వందేమాతరం' పూర్తి గీతాన్ని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంటూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకు పాడిన సగం గీతం బానిసత్వానికి నిదర్శనమని, ఈ దుస్థితిని మార్చి పూర్తి 'వందేమాతరం' గీతాన్ని ఆలపించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిఒక్కరూ సమర్థించాలని పిలుపునిచ్చారు. మిగతా..2లో

## నేనే రాజు నేనే మంత్రి అన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందన



- అలా అనుకున్న వారు ఎందరో గాలికి కొట్టుకుపోయారన్న కేటీఆర్
- తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను కూడా కామారెడ్డిలో ప్రజలు ఓడించారన్న కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణకు 'నేనే రాజు నేనే మంత్రి' అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, 'నేనే రాజు నేనే మంత్రి' అనుకునే పిచ్చి తుగ్లక్‌లు చాలామంది ఉంటారని, చరిత్రలో కూడా ఒక తుగ్లక్ ఉండేవాడని ఎద్దేవా చేశారు. అలా అనుకున్నవారు ఎందరో గాలికి కొట్టుకుపోయారని అన్నారు. ప్రజల చైతన్యాన్ని ఎవరూ తక్కువ అంచనా వేయవద్దని అన్నారు. ఈ దేశంలో ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ వంటి నాయకులు సైతం ఓడిపోయారని గుర్తు చేశారు. మిగతా..2లో

## మున్సిపల్ ఎన్నికల విజయం వేళ,

# ప్రియాంక గాంధీతో రేవంత్ రెడ్డి భేటీ

- మున్సిపల్ ఎన్నికల్లో విజయంపై ప్రియాంక గాంధీ అభినందన
- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కారణంగానే ప్రజలు పట్టం కట్టారన్న ముఖ్యమంత్రి
- ప్రజాపాలనకు ఈ ఫలితాలు నిదర్శనమన్న మల్లు భట్టివిక్రమార్క



హైదరాబాద్: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన వేళ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీతో భేటీ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ భారీ విజయం సాధించడంపై వారి మధ్య చర్చ జరిగింది. అత్యధిక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దక్కించుకోవడంపై హర్షం వ్యక్తం చేసిన ప్రియాంక గాంధీ... రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కారణంగానే ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని ఈ సందర్భంగా ప్రియాంక గాంధీతో రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ గెలుపుపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క స్పందించారు. రెండున్నరేళ్ల ప్రజాపాలనకు ఈ ఫలితాలు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ సంక్షేమ, అభివృద్ధి పాలనకు ప్రజలు పట్టం కట్టారని అన్నారు. ఈ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం, విశ్వాసం ఆదరణగా మారిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా శ్రమించారని ప్రశంసించారు.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు

# 64 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు

### పోరులోనూ అధికార పార్టీదే హవా



- 64 మున్సిపాలిటీలు కాంగ్రెస్ కైవసం
- హంగ్ వచ్చిన చోట్ల స్వతంత్రులను కలుపుకొని అధికారం కోసం ప్రయత్నాలు

హైదరాబాద్: సార్వత్రిక సమరాన్ని తలపించిన మున్సిపల్ సమరంలో ఇప్పటివరకు వచ్చిన ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగిస్తోంది. ఇప్పటివరకు వెలువడిన ఫలితాల్లో అధికార పక్షం అత్యధిక మున్సిపాలిటీలపై జెండా ఎగురవేసింది. 64 మున్సిపాలిటీలను తన ఖాతాలో వేసుకుంది. బీఆర్ఎస్ 13 మున్సిపాలిటీలను గెలుచుకుంది. ఫార్వర్డ్ బ్లాక్ వడ్డేపల్లి మున్సిపాలిటీని సొంతం చేసుకుంది.

ఇండింపెండెంట్లతో చాలా చోట్ల హంగ్ : స్వతంత్రుల పోటీతో కూడా చాలా చోట్ల హంగ్ ఏర్పడింది. ఇప్పటివరకు 37 మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడింది. మిగతా..2లో

## ఏనుగుల బీభత్సం ఆహారం కోసం ఇంటిపై దాడి ఐదుగురు మృతి




- హజారీబాగ్ గ్రామంలో ఇంటిపై ఏనుగుల గుంపు దాడి- ఐదుగురు మృతి
- అందులో ఒకే కుటుంబానికి చెందిన వారు నలుగురు ఉన్నారు.

ఢిల్లీ : ఝార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. చుర్చు బ్లాక్ పరిధిలోని గొండ్వార్ గ్రామంలో ఐదు ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. ఈ దాడిలో ఐదుగురు గ్రామస్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, గ్రామం మొత్తం భయాందోళనలో మునిగిపోయింది. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉండటం అత్యంత బాధాకరం.

## సేవాతీర్థ్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ- స్వాతంత్ర్యానంతరం

# తొలిసారిగా కొత్త భవనంలోకి పీఎంఓ

### సముదాయంలో పీఎంవో కార్యాలయం సహా క్యాబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి కార్యాలయాలు



ఢిల్లీ : దేశ పరిపాలన కార్యక్రమాలకు కేంద్రంగా మారనున్న సేవాతీర్థ్ భవన సముదాయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. దీంతో పాటు పలు కీలక మంత్రిత్వ శాఖలకు సంబంధించిన కర్తవ్య భవన్ 1, 2 లను ప్రధాని మోదీ అధికారికంగా ప్రారంభించారు. ఈ సముదాయంలో పీఎంవో కార్యాలయం సహా క్యాబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి కార్యాలయం పనిచేయనున్నాయి.

### పలు కీలక నిర్ణయాలకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు

సేవాతీర్థ భవనంపై పౌరులందరూ దేవుడితో సమానమనే అర్థ వచ్చేలా నాగరికో దేవ భవ వాఖ్యాన్ని అని చెక్కారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీతో పాటు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహల్ లాల్, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం మహిళలు, యువత కోసం తీసుకున్న పలు కీలక నిర్ణయాలకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేశారు. ముఖ్యంగా లక్ పతి దీదీ పథకంలో లబ్ధిదారుల సంఖ్యను ఆరు కోట్లకు పెంచడమే లక్ష్యంగా పీఎం రహత్ పథకంపై సంతకం చేశారు. దీంతో పాటు వ్యవసాయ మౌలిక సదుపాయల నిధిని రూ. 2లక్షల కోట్లకు పెంచే ఫైల్ పై కూడా సంతకం చేశారు. మిగతా..2లో

## సేవా తీర్థ్‌లో ప్రతి క్షణం

# దేశ హితం కోసమే పనిచేస్తాం

### భారతీయుల ఆకాంక్షలను నెరవేర్చడానికే సేవా తీర్థ్ , కర్తవ్య భవన్




ఢిల్లీ : సేవా తీర్థ్‌లో ప్రతి క్షణం దేశ హితం కోసమే పనిచేస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సేవా తీర్థ్ , కర్తవ్య భవన్ ఏ చక్రవర్తి ఆకాంక్షలను నెరవేర్చడానికి కాదని, భారతీయుల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిర్మించిందన్నారు. సేవా తీర్థ్ , కర్తవ్య భవన్ 1, 2 లను ప్రారంభించిన అనంతరం ప్రధాని మోదీ ప్రసగించారు. "వికసిత్ భారత్ దిశగా మనం ముందుకెళ్తున్నాం. లక్ష్య సాధనలో బానిసత్వపు ఆనవాళ్ల నుంచి బయటపడాలి. ప్రాణాలు అర్పించిన సైనికులకు గతంలో స్మారక చిహ్నం లేదు. మేం వచ్చాక నేషనల్ వార్ మెమోరియల్, పోలీసు స్మారకం నిర్మించాం. రేస్ కోర్సు పేరును లోక్‌కల్యాణ్ మార్గ్‌గా మార్చాం. ఈ కొత్త భవనాలు, మనదేశ గౌరవాన్ని మరింత పెంచుతాయి. దిల్లీలోని స్మారక భవనాలు దేశ ప్రజలకు ప్రేరణ కలిగించాలి. మొఘల్ గార్డెన్స్ పేరును అమృత్ ఉద్యాన్‌గా మార్చాం. బానిసత్వం గుర్తుల నుంచి పూర్తిగా బయటకు రావాలి" అని మోదీ పేర్కొన్నారు. "ఈ భవనాలన్నీ బ్రిటిష్ ఇండియా హయాంలో కట్టారు.

## ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలపై మండలిలో వాడీవేడి చర్చ




- గత ప్రభుత్వంలో ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం పెట్టలేదు
- ఫలితంగా 12 లక్షల మంది విద్యార్థులు పాఠశాలలను వీడారు
- చర్చకు భయపడి వైఎస్సార్సీపీ సభ్యులు వాకౌట్ చేస్తున్నారన్న లోకేశ్

అమరావతి: ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాల్లో వాడీవేడి చర్చ జరిగింది. రూ. 7800 కోట్ల బకాయిలుండగా, 1200 కోట్లు మాత్రమే చెల్లించేందుకు ఆదేశాలిచ్చారని వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు అన్నారు.

## నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో

# కాంగ్రెస్ ఘన విజయం

- నల్లగొండను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తానన్న మంత్రి కోమటిరెడ్డి
- వారానికి రెండు రోజులు స్థానికంగా ఉండి సమస్యలు పరిష్కరిస్తానని హామీ
- ప్రతి డివిజన్‌లో ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు ప్రకటన




హైదరాబాద్ : నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక విజయం సాధించడం పట్ల రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు అఖండ మెజారిటీని కట్టబెట్టిన నల్గొండ ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా, నల్గొండ పట్టణాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా పాలనకు ఈ గెలుపు నిదర్శనమని అన్నారు. నల్గొండలో మొత్తం 48 వార్డులకు గాను కాంగ్రెస్ కు 27, బీఆర్ఎస్ కు 9, బీజేపీకి 4, ఇతరులకు 8 స్థానాలు దక్కాయి. ఈ విజయం ద్వారా "నల్గొండ అంటే కాంగ్రెస్... కాంగ్రెస్ అంటే నల్గొండ"అని ప్రజలు మరోసారి రుజువు చేశారని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులందరికీ ఆయన అభినందనలు తెలిపారు.

## సైబర్ నేరాలపై అవగాహన

# కల్పిస్తున్నాం

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ★ సైబర్ నేరాల పెరుగుతున్నాయని నియంత్రించాలని కోరిన పలువురు ఎమ్మెల్సీలు
- ★ ప్రభుత్వం తీసుకుంటోన్న చర్యలను వివరించిన మంత్రి లోకేశ్, హోంమంత్రి అనిత
- ★ మోసం జరిగిన వెంటనే సైబర్ పోలీసులకు సమాచారం అందించాలి



అమరావతి : సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుందని హోంమంత్రి వంగలపూడి అనిత మండలిలో తెలిపారు. శాసన మండలి ప్రశ్నోత్తరాల్లో సైబర్ నేరాల నియంత్రణపై పలువురు సభ్యులు ప్రశ్నలు అడిగారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, నియంత్రించాలని కోరారు. సభ్యుల ప్రశ్నలకు హోం మంత్రి వంగలపూడి అనిత, విద్యాశాఖమంత్రి మిగతా..2లో

## మొదటి పేజి తరువాయి

### నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం

గెలుపొందిన కార్పొరేటర్లు ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. అదే సమయంలో, ఓటమి పాలైన అభ్యర్థులు నిరుత్సాహపడకుండా, తమ డివిజన్లలోని సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ఎజెండా అని స్పష్టం చేశారు. నల్గొండ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇకపై వారానికి రెండు రోజులు తాను నల్గొండలోనే అందుబాటులో ఉండి, ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. అంతేకాకుండా, ప్రతి డివిజన్‌లో ప్రజా దర్బార్ నిర్వహించి, క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. నల్గొండలో కాంగ్రెస్ జెండా ఎగురవేసిన ప్రతి కార్యకర్తకు, ఓటు వేసిన ప్రజలకు ఆయన మరోసారి ధన్యవాదాలు తెలిపారు.

### నేనే రాజు నేనే మంత్రి అన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందన

తెలంగాణ సాధించిన కేసీఆర్ వంటి నాయకుడిని కూడా కామారెడ్డిలో దురదృష్టవశాత్తూ ప్రజలు ఓడించారని అన్నారు. అక్కడ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడో స్థానానికి వచ్చారని గుర్తు చేశారు. ఇలా నేనే రాజు నేనే మంత్రి అని రేవంత్ రెడ్డిలా విర్రవీగిన వాళ్లు వచ్చారు, పోయారని... కానీ దేశం, ప్రజల చైతన్యం అలాగే ఉందన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో తాము పూర్తి స్పష్టతతో ఉన్నామని కేటీఆర్ అన్నారు. తన ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అంత విశ్వాసం ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి తిరిగి ఉప ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. పదిచోట్ల ఉప ఎన్నికలు వస్తే అప్పుడు ప్రజలు తేల్చుతారని అన్నారు.

### సేవా తీర్థ్‌లో ప్రతి క్షణం దేశ హితం కోసమే పనిచేస్తాం

ఇవన్నీ చూస్తే బానిసత్వపు ఆనవాళ్లు గుర్తుకువస్తాయి. దేశానికి రాజధానిగా తొలుత కోల్‌కతా ఉండేది. కోల్‌కతాలో ఆందోళనలు పెరగడంతో సవాళ్లు ఎదుర్కొన్నారు. 1911లో బ్రిటిషర్లు రాజధానిని కోల్‌కతా నుంచి దిల్లీకి మార్చారు. సౌత్‌బ్లాక్, నార్త్‌బ్లాక్ భవనాలు పూర్తిగా బ్రిటిష్ డిజైన్ల మేరకు నిర్మించారు. సేవా తీర్థ్, కర్తవ్య భవన్ మన స్వేచ్ఛ, స్వయంపాలనకు సంకేతం. ఈ భవనాలను జాతికి అంకితం చేస్తున్నాం. సౌత్‌బ్లాక్, నార్త్‌బ్లాక్ భవనాల్లో స్థలాభావం ఉంది, వసతులు సరిగా లేవు. సౌత్‌బ్లాక్, నార్త్‌బ్లాక్ దాదాపు వందేళ్లు పూర్తయిన భవనాలు. సౌత్‌బ్లాక్, నార్త్‌బ్లాక్ మధ్య తిరిగేందుకు ఉద్యోగులకు ఎంతో ఖర్చయ్యేది. సేవా తీర్థ్, కర్తవ్య భవన్‌తో ఉద్యోగులు, సిబ్బందికి దూరం వెళ్లాల్సిన భారం తగ్గింది. సౌత్‌బ్లాక్, నార్త్‌బ్లాక్ భవనాలను మ్యూజియంగా మారుస్తాం."

### సేవాతీర్థ్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ- స్వాతంత్ర్యానంతరం తొలిసారిగా కొత్త భవనంలోకి పీఎంఓ

స్వాతంత్ర్యానంతరం తొలిసారిగా కొత్త భవనంలోకి పీఎంఓ కార్యాలయం

ఇప్పటి వరకూ కీలక నిర్ణయాలకు వేదికగా ఉన్న సౌత్‌బ్లాక్ నుంచి ప్రధాని కార్యాలయం సేవాతీర్థ్‌కు మారింది. దీంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న ఇతర కార్యాలయాలను ఇక్కడికి మార్చారు. కాగా, స్వాతంత్ర్యానంతరం తొలిసారిగా పీఎంఓ కార్యాలయం కొత్త భవనంలోకి మారడం విశేషం. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని రూ.100 ప్రత్యేక నాణెన్ని విడుదల చేశారు ప్రధానమంత్రి మోదీ. 2014లో ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వలసవాద చిహ్నాలను తొలగింపునకు చర్యలు తీసుకుంటుందని అధికారులు వెల్లడించారు.

**సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా ఆధునిక భవనాలు**

ప్రస్తుతం ఉన్న పలు మంత్రిత్వ శాఖల భవనాలు, కార్యాలయాలు పాతవి కావడంతో రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బందిగా మారుతోంది. ఈక్రమంలోనే సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా అత్యాధునిక వసతులతో కొత్త భవనాల నిర్మాణాన్ని చేపట్టారు. భవన సముదాయంలోని కర్తవ్య భవన్-1, 2లలో ఆర్థిక, రక్షణ, వైద్య, ఆరోగ్య, న్యాయ సహా పలు కీలక మంత్రిత్వశాఖలు కార్యకలాపాలు సాగించనున్నాయి. అత్యాధునిక సౌకర్యాలు, పటిష్ఠ భద్రత, పర్యవరణహితంగా అన్ని శాఖలను ఏకీకృతం చేస్తూ ఈ పరిపాలన భవనాల సముదాయాన్ని కేంద్రం నిర్మించింది. "ఈ ప్రారంభోత్సవం భారతదేశ పరిపాలనా పాలన నిర్మాణంలో ఒక మైలురాయిని సూచిస్తుంది. ఆధునిక, సమర్థవంతమైన, అందుబాటులో ఉండే పౌర-కేంద్రీకృత పాలనా వ్యవస్థను నిర్మించాలనే ప్రధానమంత్రి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది" అని ్రామీ గురువారం ఒక ప్రకటన తెలిపింది.

**వలసవాదానికి చిహ్నాలుగా ఉన్న పేర్లను తొలగింపు**

ఇప్పటికే ప్రధానమంత్రి కార్యాలయాన్ని (్రామీ) సేవాతీర్థ్‌గా మార్చింది. అటు రాజ్‌భవన్ పేరుతో కొనసాగుతోన్న గవర్నర్ల అధికారిక నివాసాలను లోక్‌భవన్‌గా మార్చాలని కేంద్రం ప్రభుత్వం సూచించింది. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల గవర్నర్లు తమ బంగ్లాలను లోక్‌భవన్‌గా మార్చారు. వలసవాదానికి చిహ్నాలుగా ఉన్న పేర్లను తొలగించి ప్రజాస్వామ్య పంథాలో పేర్లను పెడుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. అంతకుముందు రాష్ట్రపతి భవన్ నుంచి ఇండియా గేట్ వరకు విస్తరించిన రాజ్‌పథ్ పేరును కర్తవ్యపథ్‌గా మార్చింది కేంద్ర. మొదటగా బ్రిటిష్ పాలనలో రాజ్‌పథ్‌ను కింగ్స్‌వే అని పిలిచేవారు. రేస్ కోర్స్ రోడ్ ను కూడా లోక్ కల్యాణ్ మార్గ్ గా మార్చారు. అయితే, వలసవాద ఆలోచన తీరును ప్రతిబింబించే గుర్తులను చెరిపివేయాల్సిన అవసరం ఉందని ప్రధాని, ఈ నిర్ణయం తీసుకున్నారు.

### ఏనుగుల బీభత్సం- ఆహారం కోసం ఇంటిపై దాడి- ఐదుగురు మృతి

అర్ధరాత్రి 1 నుంచి 2 గంటల మధ్య ఈ ఘటన జరిగింది. అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఐదు ఏనుగుల గుంపు ఆహారాన్ని వెతుకుతూ గ్రామంలోకి ప్రవేశించింది. ఈ క్రమంలో భుయాన్ వర్గానికి చెందిన ఓ ఇంట్లో ధాన్యం నిల్వలు ఉండటంతో ఏనుగులు ఆ ఇంటిని లక్ష్యంగా చేసుకున్నాయి. ఏనుగుల అలికిడికి నిద్రలేచిన కుటుంబ సభ్యులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ క్రమంలో ఇంటి బయట ఉన్న ఏనుగులు వారిపై దాడి చేసి తొక్కి చంపేశాయి. దీంతో నలుగురు కుటుంబ సభ్యులతో పాటు మరో వ్యక్తి కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి ప్రస్తుతం షేక్ భిఖారీ మెడికల్ కాలేజీలో చికిత్స అందిస్తున్నారు. తూర్పు అటవీ డివిజన్ డీఎఫ్ఓ వికాస్ కుమార్ ఉజ్వల్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, "ఈ ఏనుగుల గుంపు బొకారో-రామ్‌ఘర్ సరిహద్దుల మీదుగా ఇక్కడికి వచ్చింది. అవి హజారీబాగ్ వైపు వస్తాయని ఊహించలేదు. రాత్రి వేళ అంగో గ్రామానికి సమీపంలోని గొండ్వార్‌కు చేరుకున్న ఏనుగులు ఆహారం కోసం ఇళ్లపై పడ్డాయి" అని తెలిపారు.

### హైదరాబాద్‌లో పార్కుల కబ్జాలపై హైడ్రా ఉక్కుపాదం

స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. హైడ్రా తీసుకున్న ఈ చర్యలతో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. భాగ్యలక్ష్మి కాలనీలో 6 పార్కులకు విముక్తి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ పరిధిలోని సుభాష్ నగర్‌లో ఉన్న భాగ్యలక్ష్మి కాలనీలో హైడ్రా అధికారులు కీలక ఆపరేషన్ చేపట్టారు. 1968లో వేసిన ఈ లేఅవుట్‌లో పార్కుల కోసం కేటాయించిన స్థలాలు కాలక్రమేణా కబ్జాకు గురయ్యాయి. గతంలో ఈ ప్రాంతం మీదుగా వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్లను 20 ఏళ్ల క్రితం తొలగించడంతో, అప్పటి నుంచి పార్కుల స్థలాలు ఆక్రమణకు గురవుతూ వచ్చాయి. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో, నివాసితులు హైడ్రా ప్రజావాణిని ఆశ్రయించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన అధికారులు, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆక్రమణలను నిర్ధారించుకున్నారు. శుక్రవారం ఒకేసారి 6 పార్కులలోని ఆక్రమణలను తొలగించి, 2260 గజాల స్థలానికి 'హైడ్రా ఫెన్సింగ్' వేసి, అధికారిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు ఆనందంతో ర్యాలీలు తీసి, హైడ్రాకు అనుకూలంగా నినాదాలు చేశారు.

**గుడిమల్కాపూర్‌లో పార్కుకు విముక్తి**

ఇదే తరహాలో, ఆసిఫ్‌నగర్ మండలం గుడిమల్కాపూర్ గ్రామంలోని ఏజీ ఆఫీస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో దశాబ్దాలుగా కబ్జాలో ఉన్న పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. గతంలో లోతట్టు ప్రాంతంగా ఉన్న ఈ 1,152 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే, కొందరు వ్యక్తులు దానిని ఆక్రమించుకుని ఇసుక వ్యాపారం, వాహనాల పార్కింగ్, కొబ్బరి బొండాల అమ్మకాలకు వినియోగిస్తున్నారు. 2018లో జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవడంతో, స్థానికులు హైడ్రాను సంప్రదించారు. ప్రజావాణి ఫిర్యాదు ఆధారంగా హైడ్రా అధికారులు కబ్జాదారులను ఖాళీ చేయించి, స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ వేశారు. ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో హైడ్రా తన నిబద్ధతను చాటుకుంటోందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

### వందేమాతరం' పూర్తి గీతాన్ని పంచుకున్న విజయసాయిరెడ్డి...

ఈ సందర్భంగా విజయసాయి తన అభిప్రాయాన్ని వివరిస్తూ, "విదేశీ పాలకులు వెళ్లిపోయినా, విదేశీ మతాలు మన మధ్యే మిగిలిపోయాయి. అవి మన సంస్కృతిపై పరిపాలన చేయాలని చూస్తున్నాయి. భారతదేశంలో పుట్టిన మనకు మనసు ఉండదా? ఇప్పటికీ బానిసత్వపు సంకెళ్లేనా?" అని ప్రశ్నించారు. గత 120 సంవత్సరాలుగా విదేశీ మతాల వారు ఏమనుకుంటారోనన్న భయంతోనే సగం 'వందేమాతరం' గీతాన్ని పాడామా..? అని ఆయన నిలదీశారు. "మన జాతీయ గేయంలో మన అమ్మవార్ల పేర్లు ఉండకూడదా?" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితిని మార్చి, పూర్తి 'వందేమాతరం' గీతాన్ని పాడాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలని విజయసాయిరెడ్డి కోరారు.

# సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం

## మొదటి పేజి తరువాయి

నారా లోకేశ్ ప్రభుత్వం తీసుకుంటోన్న చర్యలను వివరించారు. సైబర్ నేరాల నివారణకు పోలీసు స్టేషన్లనూ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాగా చదువుకున్న వారే సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ నేరగాళ్లు వ్యవస్థీకృతంగా మోసాలు చేస్తూ, బాధితులను నమ్మించి మోసాలకు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున మోసాలు చేస్తుండటంతో కొందరు బాధితులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**సైబర్ నేరాలు-ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మండలిలో హోంమంత్రి సమాధానం**

అవగాహన లేకపోతే నేరాలకు అడ్డుకట్ట పడదు : సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 నెంబర్ కు ఫోన్ చేయాలని, వెంటనే సైబర్ పోలీసులు వచ్చి సమస్య పరిష్కరిస్తారని సూచించారు. అనుమానాస్పద లింక్ లను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దన్నారు. లింక్ పై క్లిక్ చేసే ముందు ఓ సారి ఆలోచించాలని సూచించారు. ప్రభుత్వం అవగాహన కల్పించినా ప్రజలు అప్రమత్తంగా లేకపోతే నేరాలకు అడ్డుకట్ట పడదన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి ఇప్పటి వరకు రూ.828 కోట్లు సీజ్ చేశాం, రూ.102 కోట్లు రికవరీ చేసినట్లు హోంమంత్రి అనిత తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం నియమించిన జీవోఎం అధ్యయనం చేస్తోందని, నివేదిక రాగానే త్వరలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.ప్రత్యేక కార్యచరణ: సైబర్ నేరాల నియంత్రణకు ప్రజల్లో అవగాహన మరింత పెంచాల్సిన అవసరం ఉందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ సమస్యలను నివారించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయబోతున్నామని, అన్ని పాఠశాల్లలో పిల్లలకు అవగాహన పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. హోం శాఖ నుంచి ఎన్ ఫోర్స్ మెంట్ విద్యాశాఖ ద్వారా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రత్యేక చట్టం తీసుకురావడంపై: 16 ఏళ్లలోపు పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేలా నియంత్రణా చట్టం తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని హోంమంత్రి అనిత చెప్పారు. సోషల్ మీడియా దుష్ప్రభావాలపై జనసేన ఎమ్మెల్సీ నాగబాబు శాసనమండలిలో ఆవేదన వెలిబుచ్చారు. నాగబాబు అభిప్రాయంతో ఏకీభవించిన హోంమంత్రి పిల్లలకు అవగాహన కల్పించడంతో పాటు చట్టం తీసుకురావడంపై మంత్రివర్గ ఉపసంఘం చర్చిస్తోందని తెలిపారు. వ్యక్తిత్వ హననం చేసే సాధనంగా సోషల్ మీడియా వేదిక అవుతున్నాయి. సోషల్ మీడియా దుర్వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సీఎం, డిప్యూటీ సీఎం ఆదేశించారు. 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా వినియోగించకుండా బ్యాన్ చేసే అంశంపై చట్టం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. సైబర్ నేరాల నియంత్రణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం నియమించిన జీవోఎం అధ్యయనం చేస్తోంది. నివేదిక రాగానే త్వరలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటుంది.

# గత ప్రభుత్వ పాలనపై విమర్శలు చేసిన సీఎం చంద్రబాబు

## మొదటి పేజి తరువాయి

అలానే రాష్ట్రంలో రౌడీయిజం, నక్సలిజాన్ని నిర్మూలించగలిగాం కానీ రాజకీయ నేతల ముసుగులో నేతలే నేరాలు చేస్తే ఎలా అని సీఎం ప్రశ్నించారు. ఎక్కడికి పోయినా దౌర్జన్యం చేయడం, రోడ్డంతా బ్లాక్ చేస్తున్నారని అన్నారు. గుంటూరు నుంచి విజయవాడ పోవాలంటే ఆరుగంటలా అయితే ఈ ఆరు గంటలూ ప్రజలు నరకం అనుభవించాలా అని ప్రశ్నించారు. జాతీయ రహదారులపై సమావేశాలు పెట్టకూడదని స్పష్టమైన ఆదేశాలున్నా పట్టించుకోవట్లేదని సీఎం మండిపడ్డారు. లడ్డూ కల్తీకి హెరిటేజ్ కు ఏం సంబంధం: రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను ప్రక్షాళన చేస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. కొంతమంది కావాలనే భక్తుల మనోభావాలు దెబ్బ తీస్తున్నారని దుయ్యబట్టారు. తిరుమల లడ్డూ కల్తీకి హెరిటేజ్ కు ఏం సంబంధమని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా హెరిటేజ్ అడగలేదన్న చంద్రబాబు పేపర్ ఉంది కదా అని పెద్ద హెడ్ లైన్ లు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రాండ్ డ్యామేజ్ చేస్తే హెరిటేజ్ కు నష్టం వస్తుందని వాళ్ల భావన అని, నాడు వివేకాను చంపి కూడా నారాసుర రక్తచరిత్ర అని రాశారని సీఎం గుర్తు చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. రికార్డు స్థాయిలో పింఛన్లు ఇవ్వటంతో పాటు మహిళకు ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ పథకాలను సమర్థవంతంగా ఇస్తున్నామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఆర్థిక సమస్యలున్నా కేంద్రం సాయంలో సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని చంద్రబాబు గుర్తు చేశారు. వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్రం కోలుకునేలా కేంద్రం మద్దతు ఇచ్చిందని సీఎం అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కేంద్రం కూడా భాగస్వామ్యం కావటంపై సంతోషం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ సహా అన్ని పథకాలకూ సాయం అందించిన కేంద్రప్రభుత్వంపై చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. అందుకే 11 నిమిషాలకే బయటకు వెళ్లారు: స్వర్ణాంధ్ర విజన్ 2047 ద్వారా 10 సూత్రాలు అమలు చేసి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చి దిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. తలసరి ఆదాయం రెట్టింపు అయ్యేలా పని చేస్తున్నామని క్షేత్రస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఈ విషయంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ రెండేళ్లలో సాధించిన విజయాలను గుర్తు చేసుకుని రాబోయే మూడేళ్ల లక్ష్యాలను నిర్దేశించుకుందామని అన్నారు. వైఎస్సార్సీపీకి 11 సంఖ్యతో అవినాభావ సంబంధం ఉందని అందుకే 11 నిమిషాలకే బయటకు వెళ్లారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం, భూ అక్రమాలను చంద్రబాబు ఎండగట్టారు. "పీపీపీలో ఏదైనా నిర్మిస్తే నిర్దిష్టకాలం ప్రైవేటు వ్యక్తులు నిర్వహించి తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారు. సంపద రావాలి అభివృద్ధి జరగాలి. సంపద కొంతమంది దగ్గరే పరిమితమవ్వడం సరికాదు. అందరూ శ్రద్ధగా పనిచేస్తే పీ4 దేశంలోనే ఆదర్శంగా మారుతుంది. ప్రతి ఇల్లు సోలార్ విద్యుత్ తయారు చేసేలా ప్రజాప్రతినిధులు ప్రోత్సహించాలి. త్వరలోనే ప్రతి ఒక్కరికీ ఏఐ డాక్టర్‌ను కేటాయిస్తాం. ఏం తినాలి ఏం చేయాలో ఏఐ డాక్టర్ చెబుతుంది. విశాఖలో 15 బిలియన్ల పెట్టుబడితో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చి తీరుతాం." - చంద్రబాబు, సీఎం పట్టాదారు పాస్ పుస్తకాలపై రాజముద్ర: అప్పుడు చేసిన రెవెన్యూ పాపాలు కడగడానికే ప్రభుత్వానికి ఏడాది సమయం పట్టిందన్నారు. మద్యం విషయంలో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించబోమని సీఎం హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో డబ్బుల కోసం ప్రాణాలను తీసుకున్నారని, కోట్ల రూపాయల ప్రజాధనం దోచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. ఇసుక విధానంపైనా కూటమి ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పట్టాదారు పాస్ పుస్తకాలపై రాజముద్ర



వేయించి ఇచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దడానికి సుమారు ఏడాది పట్టిందని చెప్పారు. ఎవరూ ట్యాంపరింగ్ చేయని విధంగా చేసి లబ్ధిదారులకు అందించామని గుర్తు చేశారు. చట్టసభ అనేది ప్రజా దేవాలయమని విద్యార్థులను అసెంబ్లీకి అనుమతించటం ప్రత్యేకమని సీఎం చంద్రబాబు అన్నారు. ఇటీవల విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారని, సభలో సభ్యులకంటే వారే బాగా ప్రసంగించారని గుర్తు చేశారు. విద్యార్థి దశలోనే రాజకీయాల పట్ల అవగాహన కల్పించటంపై హర్షం వ్యక్తం చేశారు. రాబోయే మూడేళ్లలో ఉత్తరాంధ్రలో అన్ని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాయలసీమలోని ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారానికి కూర్చొని మాట్లాడుకోవాలన్న చంద్రబాబు, నల్లమల సాగర్ కు తెలంగాణ ప్రభుత్వం అడ్డుపడటం సరికాదన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఇచ్చి పుచ్చుకునే ధోరణి ఉంటే అభివృద్ధి సులభంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలపై మండలిలో వాడీవేడి

## మొదటి పేజి తరువాయి

విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న 5 క్వార్టర్ల బకాయిలు ఎప్పుడిస్తారో చెప్పాలని విపక్షనేత బొత్స నిలదీశారు. వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీల ఆరోపణలు ఖండిస్తూ మంత్రులు నారా లోకేశ్ , డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి దీటుగా సమాధానం ఇచ్చారు. 2014-19 బకాయిలు రూ. 224 కోట్ల రూపాయల ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలను వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు చెల్లించలేదని మంత్రి డీఎస్‌బీవీ స్వామి తెలిపారు. బకాయిల విషయంలో ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నామని బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన బొత్స సత్యనారాయణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఎందుకు తీసేశారో తెలపాలన్నారు. ఫీజు రీఎంబర్స్ మెంట్ నిధులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ వాకౌట్ చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రూ. 4064 కోట్లు బకాయిలు పెట్టి పోయిందని, ఇప్పటివరకు రూ. 1859 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందని లోకేశ్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జూనియర్ కళాశాలల్లో సమస్యలన్నీ పరిష్కరించామన్నారు.

**చర్చకు భయపడి వాకౌట్**

: గత ప్రభుత్వం పెట్టిన బకాయిల వివరాలను సభలో పెట్టేందుకు తాము సిద్ధమని మంత్రి లోకేశ్ తెలిపారు. గత ప్రభుత్వంలో ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం పెట్టలేదని, ఫలితంగా 12



లక్షల మంది విద్యార్థులు పాఠశాలలను వీడారని అన్నారు. దీనిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జూనియర్ కళాశాలల్లో సమస్యలన్నీ పరిష్కరించామని, ఆ కృషి ఫలితంగా జూనియర్ కళాశాలల్లో 70 వేల మంది విద్యార్థులు పెరిగారని లోకేశ్ తెలిపారు. మంత్రుల సమాధానంపై విపక్షనేత బొత్స అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ. 4 వేల కోట్లు కాదు కేవలం రెండు విడతలు మాత్రమే వైఎస్సార్సీపీ ప్రభుత్వం పెండింగ్ లో పెట్టిందన్న బొత్స, కూటమి ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోగా నిధులివ్వకుండా రాష్ట్రంలో విద్యావ్యవస్థను దారుణంగా దెబ్బతీశారని ఆరోపించారు. నిరసనగా మాత్రమే సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి వైఎస్సార్సీపీ సభ్యులు బయటకు వెళ్లిపోయారు. ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలపై చర్చకు వచ్చేందుకు భయపడి వైఎస్సార్సీపీ సభ్యులు వాకౌట్ చేస్తున్నారని మంత్రి లోకేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియా దుష్ప్రభావాలపై చర్చ: 16 ఏళ్లలోపు పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేలా నియంత్రణా చట్టం తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని హోంమంత్రి అనిత చెప్పారు. సోషల్ మీడియా దుష్ప్రభావాలపై జనసేన ఎమ్మెల్సీ నాగబాబు శాసనమండలిలో ఆవేదన వెలిబుచ్చారు. నాగబాబు అభిప్రాయంతో ఏకీభవించిన హోంమంత్రి పిల్లలకు అవగాహన కల్పించడంతోపాటు చట్టం తీసుకురావడంపై మంత్రివర్గ ఉపసంఘం చర్చిస్తోందని తెలిపారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు: రాష్ట్రంలో గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. 2025-26 ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 1768 కోట్లు మంజూరు చేసి గిరిజన సంక్షేమ హాస్టళ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఎమ్మెల్సీల ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 757 గిరిజన సంక్షేమ హాస్టళ్లలో 1,78,687 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్న మంత్రి, మెగా డీఎస్సీతో గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 2 వేల మంది టీచర్లనునియమించినట్లు పేర్కొన్నారు. ఎక్కడా టీచర్ల కొరత లేదన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, సహా విద్యార్థులకు సమస్యల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ. 60 కోట్లు మంజూరు చేసి టాయిలెట్లు, ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. పోషకాహారం ఇచ్చేందుకు ప్రత్యేకంగా మెను ఇచ్చామని దాని ప్రకారం ఆహారం ఇవ్వకపోతే వార్డెన్ ను సస్పెండ్ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు - 64 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు

## మొదటి పేజి తరువాయి



కాంగ్రెస్ : నేరేడుచర్ల, హుజూర్‌నగర్, హాలియా, కోదాడ, సూర్యాపేట, నందికొండ, చండూరు, చిట్యాల, భూత్పురు, ధర్మపురి, భీమ్ గల్, బిచ్కుంద, బాన్సువాడ, ఎల్లారెడ్డి, చొప్పదండి, సుల్తానాబాద్, చెన్నూరు, మంథని, హుస్నాబాద్, మరిపెడ, డోర్నకల్, నారాయణఖేడ్, సంగారెడ్డి, ఆందోలు-జోగిపేట, సదాశివపేట, రామాయంపేట, హుజూరాబాద్, కొల్లాపూర్, మద్దూరు, పెబ్బేరు, స్టేషన్ ఘన్ పూర్, మధిర, అశ్వారావు పేట, ఇల్లెందు, ములుగు, ఆత్మకూరు, కల్వకుర్తి, వైరా, కల్లూరు, పరకాల, సత్తుపల్లి, ఆలేరు, యాదగిరి గుట్ట, నాగర్ కర్నూలు, మిర్యాలగూడ, మక్తల్, కోస్గి, ఆర్మూర్, పెద్దపల్లి, చేవెళ్ల, శంకర్ పల్లి, షాద్ నగర్, కొడంగల్, కొత్తకోట, మోత్కురు, ఏదులాపురం, లక్షెట్టిపేట, చౌటుప్పల్, భువనగిరి, నిర్మల్, నర్సంపేట, భూపాలపల్లి, కోరుట్ల, తాండూరు. బీఆర్ఎస్ : గడ్డిపోతారం, గుమ్మడిదల, అయిజ, ఇబ్రహీంపట్నం, తొర్రూర్, చేర్యాల, తిరుమలగిరి, ఆమన్‌గల్, మూడు చింతలపల్లి, సిరిసిల్ల, తూప్రాన్, దుబ్బాక, గజ్వేల్.

బీజేపీ : మున్సిపాలిటీ ఖాతా తెరవలేదు, వార్డులు మాత్రమే గెలిచారు. ఫార్వర్డ్ బ్లాక్ : జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి ఫార్వర్డ్ బ్లాక్(సింహం గుర్తు) కైవసం చేసుకుంది. మొత్తం 10 వార్డుల్లో ఎనిమిది చోట్ల ఫార్వర్డ్ బ్లాక్ తరఫున బరిలోకి దిగిన అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు. మిగతా రెండు స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కో స్థానాన్ని గెలుచుకున్నాయి. మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ 24, 26 వార్డుల నుంచి పోటీ చేసిన భార్యాభర్తలైన కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఖమ్మంలో టీడీపీ అభ్యర్థి గెలుపు : ఖమ్మం జిల్లా మధిర మున్సిపాలిటీలోని 10వ వార్డులో టీడీపీ అభ్యర్థి బోడేపూడి రేవతి జయకేతనం ఎగురవేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి పెదపూడి సుధాకర్‌పై ఆమె విజయం సాధించారు. సంగారెడ్డి జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ 24, 26 వార్డుల నుంచి పోటీ చేసిన భార్యాభర్తలైన కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ ఫార్వర్డ్ బ్లాక్ కైవసం : జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీని ఫార్వర్డ్ బ్లాక్(సింహం గుర్తు) కైవసం చేసుకుంది. మొత్తం 10 వార్డుల్లో ఎనిమిది చోట్ల ఫార్వర్డ్ బ్లాక్ తరఫున బరిలోకి దిగిన అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు. మిగతా రెండు స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కో స్థానాన్ని గెలుచుకున్నాయి. ఆసక్తికర ఫలితాలు : నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీలోని ఒకటో వార్డులో ఊహించని విధంగా ట్రాన్‌జెండర్ గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన నాగిళ్ల కావేరి సుధాకర్ 102 ఓట్ల మెజార్టీతో విజయఢంకా మోగించారు. సంగారెడ్డి జిల్లాలోని రామాయంపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీచేసిన భార్యభర్తలు 24, 26 వార్డుల నుంచి విజయం సాధించారు.చాలా మున్సిపాలిటీల్లో హంగ్ : మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో ఏ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ రాలేదు. దేవరకద్రలో 12 వార్డులు ఉండగా కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 4, బీజేపీ 1, ఇతరులు 1 గెలుచుకున్నారు. మహబూబాబాద్ జిల్లా కెసముద్రం మున్సిపాలిటీలో ఏ పార్టీ ఆధిక్యం కనబర్చలేదు. 16 వార్డుల్లో కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 8 గెలుచుకున్నాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్ మున్సిపాలిటీలో మొత్తం 16 వార్డులకు గాను కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 5 చోట్ల విజయం సాధించాయి. బీజేపీ, ఎంఐఎం, స్వతంత్ర అభ్యర్థి ఒక్కో చోట గెలిచారు. క్యాతనపల్లిలోనూ అదే పరిస్థితి : మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో మ్యాజిక్ ఫిగర్ ఏ పార్టీకి దక్కలేదు. క్యాతనపల్లిలో 22 వార్డులు ఉండగా కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 10, బీజేపీ 1, ఇతరులు 4 గెలుచుకున్నారు. వనపర్తి జిల్లా అమరచింతల మున్సిపాలిటీలోనూ మ్యాజిక్ ఫిగర్‌ను ఏ పార్టీ దాటలేదు. 10 వార్డుల్లో కాంగ్రెస్ 3, బీఆర్ఎస్ 3, బీజేపీ 3, ఇతరులు 1 చోట విజయం సాధించారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో హంగ్ ఏర్పడింది. 20 వార్డుల్లో బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7, ఇతరులు 4 చోట్ల గెలుపొందారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీలో హంగ్ ఏర్పడింది. 16 వార్డుల్లో కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 8 స్థానాలు దక్కించుకున్నాయి.

# సంపాదకీయం

## అసోంలో హిమంత హాలాహలం

సోషల్ మీడియా వివేక రాహిత్య ప్రమాణాల ప్రకారం చూసినా భారతీయ జనతా పార్టీ అసోం శాఖ ఎక్స్ హ్యాండిల్‌లో పోస్ట్ చేసిన ఓ వీడియో నాగరిక విలువల మరింత భ్రష్టత్వానికి అద్దం పట్టింది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలోనే తొలగించివేసిన ఆ వీడియోలో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఇద్దరు వ్యక్తుల (ఒకరు చిన్న టోపీ ధరించిన వ్యక్తి కాగా మరొకరు నిండు గడ్డంతో ఉన్న వ్యక్తి)పై ఎయిర్ రైఫిల్‌ను పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో గురిపెట్టి ఉన్న దృశ్యం కనిపిస్తుంది. బంగ్లాదేశీ ముస్లిం వలసకారులకు వ్యతిరేకంగాను, అసోం ప్రజల అస్తిత్వాన్ని కాపాడడమే లక్ష్యంగా ఆ వీడియోను రూపొందించినట్టు చెబుతున్నారు. అయితే అందులోని హింసాత్మక మతతత్వ దృశ్యాలను గమనిస్తే అంతకంటే కక్షపూరిత ప్రవర్తన మరొకటి ఉండదని స్పష్టమవుతుంది. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి, రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన నాయకుడు ముస్లింలపై తుపాకీ గురిపెట్టడమనేది రాజ్యాంగ బాధ్యతల ఉల్లంఘనకు ఒక భయంకర ఉదాహరణ. జిత్తులమారి నాయకుడు అయిన హిమంత అటువంటి వీడియో ఉన్న విషయం తన దృష్టికి రాలేదని అన్నారు. ఆయన వాదాన్ని అంగీకరించేవారు బహుశా ఎవరూ ఉండరు. బీజేపీ అసోం విభాగం స్వయంగా సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేసిన వీడియో అది. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఆ వీడియోను తొలగించే సమయానికి దాన్ని పదిలక్షల మందికి పైగా వీక్షించారు. హిమంత రాజకీయ వైఖరులు తెలిసినవారు ఆ వీడియో గురించి ఆశ్చర్యపోరు. ఇప్పటికి చాలా నెలలుగా 'మియా' (అసోంలో బెంగాలీ మాట్లాడే ముస్లింల గురించి మొరటుగా ప్రస్తావించే పదమది) లకు వ్యతిరేకంగా జరుగుతున్న ఒక విషపూరిత ప్రచారానికి హిమంత నాయకత్వం వహిస్తున్నారు. ఆర్థిక కార్యకలాపాల నుంచి 'మియా'లను బహిష్కరించాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. దుకాణదారులు, కూరగాయల విక్రేతలు, ఆటో రిక్షా డ్రైవర్లు మొదలైన వారందరినీ ఆర్థిక జీవనం నుంచి బహిష్కరించాలని ఆయన నిక్కచ్చిగా చెబుతున్నారు. ఇటువంటి వైఖరిని అనుసరిస్తున్నందుకు ఆయనేమీ విచారం వ్యక్తం చేయలేదు. ఎటువంటి సంజాయిషీలు ఇవ్వలేదు. అసోం సాంస్కృతికనాగరికతా విలువలను సంరక్షించుకునేందుకు 'మియా'ల బహిష్కరణ తప్పనిసరి అని ఆయన గట్టిగా వాదిస్తున్నారు. ముస్లింలను నిందిస్తూ తాను నిరంతరమూ చేస్తోన్న వ్యాఖ్యలు, ప్రకటనలు మొదలైనవి ఎన్నికలలో లబ్ధి చేకూరుస్తాయని హిమంత విశ్వసిస్తున్నట్టుగా కనిపిస్తోంది. అధికార దుర్వినియోగంతో ముఖ్యమంత్రి, ఆయన కుటుంబమూ అపరిమితమైన ఆస్తులు సమకూర్చుకున్నారని కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. హిమంత రెచ్చగొడుతున్న మతతత్వ భావోద్రేకాలు ఆ ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడమే కాకుండా, వారి మధ్య మతపరమైన విభేదాలనూ సృష్టిస్తున్నాయి. 'బయటి వ్యక్తి'పై ఆగ్రహం, అసహ్యం అసోం సామాజిక జీవన రంగాలలో దశాబ్దాల నుంచీ భాగంగా ఉంటూ వస్తోంది. తమ గడ్డపై తమ సంఖ్య తగ్గిపోతుండడం, బెంగాలీ భాష మాట్లాడేవారి సంఖ్య పెరిగిపోతూ, తమపై వారు ఆధిపత్యం చలాయించడాన్ని అస్సామీ భాష మాట్లాడే ప్రజలు సహజంగానే సహించలేకపోతున్నారు. వారి నిరసనలకు తననుతాను ఒక లౌడ్ స్పీకర్‌గా నిలుపుకోవడంలో హిమంత సఫలమయ్యారు. అసోం జనాభాలో ముస్లింలు 38 శాతం మంది ఉన్నారు. ఈ కారణంగా జనాభాపరమైన మార్పులు, అస్సామీ సంస్కృతి మనుగడకు ఎదురవుతున్న సవాళ్ల విషయమై నిజమైన, ఊహాత్మక భయాందోళనలను రెచ్చగొట్టడం చాలా సులువు. ఈ కారణంగానే సామాజిక మాధ్యమాలలో ప్రత్యక్షమైన ఆ విద్వేషపూరిత వీడియో సందేశం తీవ్ర స్థాయిలో సమస్యాత్మకమైంది. అసోం వెలుపల విద్వేష ప్రసంగంగా పరిగణన అవుతున్నది అసోంలో మాత్రం ఆ గడ్డ ప్రజల చారిత్రక, భాషాపరమైన, సాంస్కృతిక, ఆర్థిక హక్కులను కాపాడేందుకు ఉద్దేశించినది అవుతున్నది. ప్రస్తావిత వీడియో మైనారిటీలకు వ్యతిరేకంగా ఆగ్రహాన్ని రెచ్చగొట్టేదిగా కాకుండా నిత్య జీవితంలో రోజువారీ అనుభవాల ఆధారంగా ఏర్పడే రాజకీయ అవగాహనను ప్రతిబింబించేదిగా సమర్థనీయమవుతున్నది. 2002లో గుజరాత్ అల్లర్లను గుజరాతీ అస్మిత (ఆత్మగౌరవం)ను రక్షించేందుకు చెలరేగినవిగా అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ సమర్థించారు. ఇప్పుడు అసోం పరిణామాలలోనూ అటువంటి వైఖరే వ్యక్తమవుతోంది. అస్సామీ భాషా సంస్కృతులను సంరక్షించేందుకు రాజకీయ స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలలో భాగమే ఆ పరిణామాలు. మరి ఆ వివాదాస్పద వీడియో వ్యవహారంపై బీజేపీ జాతీయ నాయకత్వం మౌనం వహించడంలో ఆశ్చర్యమేమీ లేదు. అంతర్జాతీయంగా మద్దతు పొందేందుకు 'సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్' అనే నినాదం ఉపయోగపడవచ్చుగానీ ఎన్నికలు జరగనున్న అసోంలో రాజకీయ లబ్ధిని సమకూర్చుకునేందుకే మతతత్వ భావోద్రేకాలను రెచ్చగొట్టడం అనివార్యమవుతోంది. కనుకనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అసోంను సందర్శించిన ప్రతిసారీ 'అక్రమ చొరబాటుదారుల' గురించి ఆ రాష్ట్ర ప్రజలను హెచ్చరిస్తూ ఉంటారు. అంతర్జాతీయ సరిహద్దుల వద్ద కాపలా ఉండేది కేంద్ర బలగాలే అన్న వాస్తవాన్ని బీజేపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తారు.

## ఓపెన్ ఏఐలో ఏం జరుగుతోంది?



కృత్రిమ మేధ... ప్రజల అవసరాల కోసమా, లేక కొందరి వ్యాపార ప్రయోజనాల కోసమా? ఈ సందేహాన్ని లేవనెత్తుతోంది గతేడాది విడుదలై సంచలనం సృష్టిస్తున్న పుస్తకం- ఎంపైర్ ఆఫ్ ఏఐ: డ్రీమ్స్ అండ్ నైట్‌మేర్స్ ఇన్ సామ్ ఆల్ట్‌మన్స్ ఓపెన్ ఏఐ. టెక్ జర్నలిస్ట్ కరెన్ హావ్ ఇందులో ఓపెన్ ఏఐ సంస్థ, సారథుల ప్రస్థానాన్ని విశ్లేషిస్తూ ఈ అద్భుత సాంకేతికతను అడ్డంపెట్టుకుని సాగిస్తున్న వ్యాపారాన్ని ఆధునిక సామ్రాజ్యవాదంతో పోల్చారు. ఏఐ నాణేనికి మరోవైపున జరుగుతున్న వనరుల దోపిడీ గురించి, లాభాపేక్షలేని సంస్థగా మొదలై ప్రపంచంలోనే అత్యంత విలువైన ప్రైవేటు సంస్థగా మారడం గురించి, సంస్థ సారథి-సామ్ ఆల్ట్‌మన్ చేతిలో ఉన్న అపరిమిత అధికారం గురించి ఆలోచించమంటున్నారు. ఏ సమాచారం కావాలన్నా గూగులమ్మను అడగడం ఓల్డ్ ఫ్యాషన్. జెన్ జీతో కలిసి నడవాలంటే సంభాషణలో ప్రతి రెండో వాక్యంలోనూ చాట్ జీపీటీ, గ్రోక్, క్లాడ్‌లలో ఏదో ఒకదాన్ని ప్రస్తావించాలి. జెమినై బెటరా కోపైలట్ బెటరా, పర్‌ప్లెక్సిటీ ప్రత్యేకత ఏంటి, డీప్‌సీక్ ఏం చేయబోతోంది... లాంటివి చర్చించగలగాలి. ఏడెనిమిదేళ్ల క్రితం మనకివేవీ తెలియవు. పైన చెప్పినవేవీ అప్పటికి పుట్టలేదు కూడా. కృత్రిమమేధ అన్న మాటొక్కటి తెలుసు, దాంతో అద్భుతాలు చేయడానికి పరిశోధనలు జరుగుతున్నాయని కాస్తో కూస్తో టెక్నాలజీ విషయాలు తెలిసినవారికి అవగాహన ఉండేది. అలాంటిది హఠాత్తుగా ఇవన్నీ నిత్య జీవితంలోకి ఎలా వచ్చేశాయి? ముఖ్యంగా గత మూడేళ్లలో ఈ రంగంలోనూ, సిలికాన్ వ్యాలీలోనూ చోటుచేసుకున్న మార్పులు సైంటిఫిక్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తున్నాయి. కరెన్ హావ్ ఎంఐటీ టెక్నాలజీ రివ్యూ మ్యాగజీన్‌కి సీనియర్ ఏఐ ఎడిటర్‌గా, వాల్‌స్ట్రీట్ జర్నల్, ది అట్లాంటిక్ పత్రికలకు కరెస్పాండెంట్‌గా పనిచేశారు. ప్రత్యేకించి కృత్రిమమేధ, అది ప్రపంచం మీద చూపనున్న ప్రభావం గురించి ఏడేళ్ల రిపోర్టింగ్ అనుభవం ఉంది. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా 'ఓపెన్ ఏఐ' (చాట్ జీపీటీని తయారుచేసింది ఈ సంస్థే) గురించి ఎక్కువగా రాసేవారు. ఆ సందర్భంగా సంస్థ ఆంతరంగిక విషయాలూ తెలిశాయి. ఎవరెవరు పెట్టుబడులు పెట్టిందీ, సంస్థ ఎలా ఎదుగుతున్నదీ దగ్గర నుంచి గమనించారు. అదీ ఈ పుస్తక రచనకు నేపథ్యం. తన అనుభవానికి తోడు 300లకు పైగా ఇంటర్వ్యూలు, ఈ-మెయిల్స్, వ్యక్తిగత సందేశాలను ఆధారంగా తీసుకున్నారు. ఇంటర్వ్యూలిచ్చిన వారిలో సగానికి పైగా ఓపెన్ ఏఐ సంస్థలో పనిచేసినవాళ్లే. మిగిలినవాళ్లు ఇతర టెక్ సంస్థల్లో పనిచేస్తూ సామ్ ఆల్ట్‌మన్‌కి సన్నిహితంగా ఉన్నవాళ్లు. 2023 నవంబరులో జరిగిన సామ్ ఆల్ట్‌మన్ తొలగింపు ఉదంతంతో పుస్తకాన్ని మొదలెట్టారు కరెన్. బోర్డు సభ్యులు ఎంతో మల్లగుల్లాలు పడి తీసుకున్న ఆ నిర్ణయాన్ని వెంటనే మార్చుకోవాల్సి వచ్చిందంటే ఆల్ట్‌మన్ ఎంతటి శక్తిమంతుడో ఆలోచించమంటుంది కరెన్ పుస్తకం.

ఎవరీ సామ్ ఆల్ట్‌మన్?

సిలికాన్ వ్యాలీ గోల్డెన్‌బోయ్‌గా మారిన సామ్ ఆల్ట్‌మన్ సంపన్నుల ఇంట పుట్టారు. తండ్రి మెకింతోష్ కంప్యూటర్ కొనిస్తే ఎనిమిదేళ్లకే కోడింగ్ నేర్చుకున్నారట. పందొమ్మిదో ఏట స్టాన్‌ఫర్డ్‌లో డిగ్రీ చదువు మధ్యలో ఆపేసి 'లూప్ట్' అనే సోషల్ నెట్‌వర్క్ ప్రారంభించారు, 30 మిలియన్ డాలర్ల పెట్టుబడులు సేకరించారు. 2012లో దాన్ని అమ్మేసి స్టార్టప్‌లకు పెట్టుబడులు పెట్టే వై కాంబినేటర్‌లో భాగస్వామిగా చేరి అధ్యక్షుడయ్యారు. 2015లో ఎలాన్ మస్క్, సామ్ ఆల్ట్‌మన్, ఇల్యా సట్‌స్కీవర్ మరికొందరు కలిసి కృత్రిమమేధ గురించి పరిశోధన చేయడానికి; సురక్షితమైన, మానవాళికి ఎంతో ఉపయోగకరమైన ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్‌ని అందరికీ అందుబాటులోకి తేవడానికి 'ఓపెన్ ఏఐ' అనే లాభాపేక్ష లేని సంస్థను ప్రారంభించారు. ఇతర సంస్థలతో కలిసి పనిచేస్తూ, పరిశోధనాఫలాలను అందరికీ అందుబాటులో ఉంచాలన్నది తొలినాళ్ల ఆశయం. వ్యవస్థాపకులే కాకుండా మైక్రోసాఫ్ట్‌తో సహా పలువురు ఇందులో పెట్టుబడులు పెట్టారు. 2019లో ఆల్ట్‌మన్ సంస్థ సీఈవో అయ్యారు. పోటీ, భద్రత లాంటి కారణాలు చెబుతూ క్రమంగా ఆశయాన్ని పక్కదోవ పట్టించారు. సాంకేతిక, వ్యాపార ప్రపంచాల పనితీరును బాగా అర్థం చేసుకున్న ఆల్ట్‌మన్ టాలెంట్‌తోపాటు సంపదనీ సంస్థలో కూడబెట్టారు. ఇతర కంపెనీలను స్వాధీనం చేసుకున్నారు. లాభాపేక్ష లేకుండా మొదలైన సంస్థని 500 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు.

కేసు పెట్టిన మస్క్

ఆల్ట్‌మన్ ధోరణి నచ్చక మస్క్‌తో సహా పలువురు బయటికి వెళ్లిపోయారు. ప్రజోపయోగం నుంచి లాభాపేక్ష వైపు మళ్లినందుకు 2024లో ఎలాన్ మస్క్ ఓపెన్ ఏఐ సీఈవో మీద కేసు పెట్టారు. కంపెనీ ప్రగతికి అడ్డుపడుతూ తమ ఉత్పత్తులను వ్యక్తిగత లబ్ధికి వాడుకుంటున్నారంటూ మస్క్ మీద ఎదురు కేసు నమోదైంది. కంపెనీని కొనడానికి సైతం మస్క్ ముందుకు రాగా అది అమ్మకానికి లేదని సమాధానమిచ్చారు. మస్క్ పెట్టిన కేసు విచారణ వచ్చే ఏప్రిల్‌లో మొదలవనుంది. ఆల్ట్‌మన్ మరెన్నో సంస్థల్ని ప్రారంభించారు, కొన్ని వందల కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారు. టాలెంట్‌నీ పెట్టుబడుల్నీ ఆకర్షించడంలో ఆల్ట్‌మన్ నైపుణ్యానికి ఎవరూ సాటిరారంటారు కరెన్. 'నిండా నరమాంస భక్షకులున్న దీవిలో సామ్‌ని కనక వదిలేసి ఓ అయిదేళ్ల తరవాత వెళ్లి చూస్తే అతడా దీవికి రాజై ఉంటాడు...' అన్న పాల్ గ్రాహమ్ వ్యాఖ్యకు వత్తాసు పలుకుతుంది కరెన్ వివరణ. 575 పేజీల ఈ పుస్తకం సిలికాన్ వ్యాలీ నిపుణులు ఎంత శక్తిమంతులో చెబుతుంది. పవర్ స్ట్రగుల్‌ని వివరిస్తుంది. ఓపెన్ ఏఐ సంస్థ వ్యవహారాన్ని సామ్రాజ్యవాదంతో పోలుస్తూ ముఖ్యంగా నాలుగు విధానాలను ప్రస్తావించారు కరెన్. మానవాళి శ్రేయస్సు కోసమని చెప్పడం, తమవి కాని వనరుల్ని స్వాధీనం చేసుకోవడం(డేటా, నీరు, కరెంటు), శ్రామికశక్తి దోపిడి, నిపుణ మానవ వనరులను కేంద్రీకృతం చేయడం... లాంటివాటి గురించి విస్తృతంగా చర్చించారు. ఓపెన్ ఏఐ మాత్రమే కాకుండా కృత్రిమమేధపై పలు సంస్థలు లోతైన పరిశోధనలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సమాజం మీద ఏఐ ప్రభావం ఏంటి, ఎలాంటి నష్టాలున్నాయి; వివక్ష, పౌరహక్కులకు సంబంధించి ఎలాంటి పక్షపాత వైఖరిని ఏఐ మోడల్స్‌లో నిక్షిప్తం చేస్తున్నారు... లాంటివి చర్చించాల్సిన సమయమిది. అది మరచి ఒక పక్క చాట్‌జీపీటీ మోజు, మరోపక్క సర్వరోగనివారిణిలా అన్ని సమస్యలకీ ఏఐనే పరిష్కారం అన్నట్లుగా జరుగుతున్న ప్రచారంలో కొట్టుకుపోతున్న సమాజం గురించి కరెన్ ఆవేదన అర్థవంతమైనదే.

## రూటు మారనున్న డాలర్ డ్రీమ్స్!

దశాబ్దాలుగా భారతీయ మధ్య తరగతి మేధావులకు 'అమెరికా' ఒక స్వర్గధామం. సాంకేతిక నైపుణ్యం కలిగిన భారతీయులకు, వారిని క్లయింట్ల వద్దకు చేర్చే ఐటీ కంపెనీలకు హెచ్-1బీ వీసా ఒక వారధిలా పనిచేసింది. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ పునరాగమనం తర్వాత, ఈ వారధిపై ఆంక్షల కంచెలు పెరుగుతున్నాయి..

రూటు మారనున్న డాలర్ డ్రీమ్స్!

దశాబ్దాలుగా భారతీయ మధ్య తరగతి మేధావులకు 'అమెరికా' ఒక స్వర్గధామం. సాంకేతిక నైపుణ్యం కలిగిన భారతీయులకు, వారిని క్లయింట్ల వద్దకు చేర్చే ఐటీ కంపెనీలకు హెచ్-1బీ వీసా ఒక వారధిలా పనిచేసింది. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ పునరాగమనం తర్వాత, ఈ వారధిపై ఆంక్షల కంచెలు పెరుగుతున్నాయి.. ఫిబ్రవరి 2026 నాటికి అమల్లోకి వస్తున్న మార్పులు కేవలం ఒక దేశ విధాన నిర్ణయాలు మాత్రమే కాదు, ప్రపంచ ఐటీ ముఖచిత్రాన్ని మార్చేస్తున్నాయి.

వ్యవసాయ రంగానికి నవశకం!

తాజాగా కొద్దిరోజుల కిందట అర్కాన్సాస్ సెనెటర్, రిపబ్లికన్ పార్టీలో కన్జర్వేటివ్ (సంప్రదాయవాది) నాయ కుడిగా పేరొందిన టామ్ కాటన్ ఓ వేదికపై మాట్లాడుతూ మొత్తంగా హెచ్-1బీ వీసా వ్యవస్థనే ఎత్తివేయాలని డిమాండ్ చేశాడు.. దీంతో ఇప్పటికే అమెరికాపై భారతీయ టెకీలకు ఉన్న కాసింత ఆశలపై ఆయన నీళ్లు చల్లేశాడు. ఇప్పుడు సగటు ఐటీ ఉద్యోగితో పాటు కంపెనీలు ఎటువంటి నిర్ణయం తీసుకుంటాయనే అంశంపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. అయితే, తనొకటి తలిస్తే దైవం మరొకటి తలచినట్టు.. ట్రంప్ అమెరికన్లకు ఉద్యోగం రావాలని హెచ్-1బీ వీసాలపై ఆంక్షలు విధిస్తుంటే.. భారతీయ కంపెనీలు ప్లాన్ బీ అమలు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. దీంతో ఉద్యోగాల మాట అటుంచి.. ఐటీ కంపెనీల నుంచి వచ్చే ఆదాయం కూడా అమెరికాకు అందకుండా పోయే ప్రమాదం ఉన్నది. దీంతో ట్రంప్ నిర్ణయాలు బూమరాంగ్ అయ్యేందుకు ఎంతో సమయం పట్టేలా లేదు..

ఏఐ దుష్ప్రయోగానికి కేంద్రం అడ్డుకట్ట!

భారత కంపెనీలకు అవరోధాలు..

భారత ఐటీ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి కంపెనీలు ప్రస్తుతం ముందెన్నడూ లేని సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ప్రతి కొత్త హెచ్-1బీ వీసా పిటిషన్‌పై వి100,000 అదనపు రుసుము విధించాలనే ప్రతిపాదన కంపెనీల లాభదాయకతను దెబ్బతీస్తున్నది. వేల సంఖ్యలో ఉద్యోగులను పంపే కంపెనీలకు ఇది కోట్లాది రూపాయల అదనపు భారం. కొత్త నిబంధనల ప్రకారం, లాటరీ పద్ధతి స్థానంలో అత్యధిక వేతనం ఇచ్చే వారికే వీసా కేటా యిస్తారు. దీనివల్ల తక్కువ అనుభవం ఉన్న ఇంజినీర్లను అమెరికా పంపడం అసాధ్యంగా మారుతుంది. వీసా నిబంధనలు ఎప్పుడు మారుతాయో తెలియని పరిస్థితి వల్ల, కంపెనీలు దీర్ఘకాలిక ప్రాజెక్టులను ప్లాన్ చేసుకోవడానికి సిద్ధంగా లేవు.. ట్రంప్ తీసుకువచ్చిన విధానాల వల్ల అంతిమంగా నష్టపోయేది సామాన్య ఐటీ ఉద్యోగి మాత్రమే.. గతంలో 3 - 4 ఏళ్ల అనుభవం ఉన్నవారు అమెరికా వెళ్లి డాలర్లలో సంపాదించేవారు.. ఇప్పుడు ఆ అవకాశం కేవలం సీనియర్లకు, అత్యున్నత నిపుణులకు మాత్రమే పరిమితం కానుంది.

తరగని స్వరం... రేడియో!

అమెరికాకు లాభమా? నష్టమా?

ట్రంప్ ప్రభుత్వం 'అమెరికా ఫస్ట్' అని వాదిస్తున్నప్పటికీ, దీనివల్ల అమెరికాకు కూడా కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి. అమెరికన్ కంపెనీలకు భారత్ నుండి వచ్చే చౌకైన సాంకేతిక సాయం అందకపోతే, వారి ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి. ఇది అమెరికాలో ద్రవ్యోల్బణానికి దారి తీయనున్నది. అమెరికాలో ఐటీ రంగంలో




నిపుణుల కొరత ఉంది. భారతీయ ఇంజినీర్లను అడ్డుకుంటే, ఆ స్థానాన్ని భర్తీ చేసేంత మంది స్థానిక నిపుణులు అక్కడ అందు బాటులో లేరు. స్థానిక అమెరికన్లకు ఎక్కువ ఉద్యోగాలు లభించడం, విదేశీయులపై ఆధారపడటం తగ్గడం అమెరికా రాజకీయ నేతలకు లాభం చేకూర్చే అవకాశం ఉన్నా.. అమెరికన్లపై మాత్రం మరింత భారం పడనున్నది.

### తెలంగాణ జాతిపిత ఎవరు?

### రూటు మార్చుతున్న కంపెనీలు..

ఈ సవాళ్లను అధిగమించేందుకు భారత కంపెనీలు 'ప్లాన్- బీ'ని సిద్ధం చేసుకుంటున్నాయి. అమెరికాలోనే అమెరికన్లను లేదా గ్రీన్ కార్డ్ హోల్డర్లను ఉద్యోగాల్లోకి తీసుకోవడం పెంచాయి. గత కొన్నేళ్లుగా భారత కంపెనీలు అమెరికాలో అతిపెద్ద ఉద్యోగ కల్పన కర్తలుగా మారడానికి ఇదే కారణం. మనుషుల అవసరం లేకుండానే పనులు పూర్తి చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పెట్టుబడులు పెంచుతున్నాయి. 'కోడింగ్' వంటి పనులను ఆటోమేట్ చేయడం ద్వారా వీసాల అవసరాన్ని తగ్గించుకుంటున్నాయి. కొవిడ్ కాలంలో అలవాటైన 'రిమోట్ వర్కింగ్' మోడల్‌ను ఇప్పుడు క్లయింట్లు కూడా అంగీకరిస్తు న్నారు. భారత్ నుండే 90% ప్రాజెక్టును పూర్తి చేసి, అత్యంత కీలకమైన పనులకు మాత్రమే మనుషులను అమెరికా పంపడంపై దృష్టి పెడుతున్నాయి.

### మెక్సికో, కెనడా కేంద్రాలుగా..

అమెరికా వీసా నిబంధనల నుండి తప్పించుకోవడానికి భారత కంపెనీలు ఇప్పుడు అమెరికాకు సరిహద్దులో ఉన్న దేశాలను కెనడా, మెక్సికోలను ఎంచుకుంటున్నాయి. కెనడా ఇమ్మిగ్రేషన్ విధానాలు సాపేక్షంగా సరళంగా ఉండటంతో.. భారత కంపెనీలు టొరంటో, వాంకోవర్ వంటి నగరాల్లో పెద్ద సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాయి.. అమెరికా టైమ్ జోన్‌లోనే ఉంటూ, అక్కడి క్లయింట్లకు సేవలు అందించడానికి ఇది సులభం. తక్కువ ఖర్చుతో కూడిన శ్రమశక్తి లభించడం వల్ల మెక్సికో కూడా ఐటీ హబ్‌గా మారుతున్నది. దీనివల్ల అమెరికా పన్ను ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. కంపెనీలు భౌతికంగా అమెరికాలో లేకపోయినా, అమెరికా మార్కెట్ నుండి లాభాలను పొందుతాయి.

### వ్యతిరేకిస్తున్నది ఆ ముగ్గురే..

అమెరికాలో హెచ్-1బీ వీసాలను ప్రధానంగా వ్యతిరే కిస్తున్నది ముగ్గురు.. అందులో ఒకరు స్వయంగా భారతీయుడైతే మరొకరు భారత్‌తో దగ్గరి సంబంధాలు ఉన్న వ్యక్తి కావడం గమనార్హం. రిపబ్లికన్ పార్టీలో నంబర్ 2 తర్వాత అమెరికా అధ్యక్షుడు అయ్యేందుకు అవకాశాలు ఉన్నాయని భావిస్తున్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఒకరైతే, భారతీయుడైన వివేక్ రామస్వామి మరొకరు, అర్కాన్సాస్ సెనెటర్ కరుడుగట్టిన సంప్రదాయవాదిగా పేరొందిన టామ్ కాటన్ వీరే హెచ్ 1బీ వీసాలకు వ్యతి రేకంగా మాట్లాడుతున్నారు.. మొత్తంగా అమెరికాకు మరింత లబ్ధి చేకూర్చాలని అంతిమంగా తాము రాజ కీయంగా లాభం పొందాలని ఆడుతున్న ఆట చివరికి అమెరికా ప్రయోజనాలకు గండి కొట్టనున్నాయి.. భారతీయ ఐటీ నిపుణులను అడ్డుకోవడం అంటే బంగారు గుడ్లు పెడుతున్న బాతును పొట్ట కోయడమే అవుతుందన్న సత్యం అర్థం కావడానికి మరెన్నో రోజులు పట్టదన్నది మాత్రం కఠోర వాస్తవం.

## విదేశీ స్కాలర్‌షిప్‌లతో సర్కార్ చెలగాటం

ఆలస్యం అమృతం విషం అన్న సూక్తి బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు నిధులు విడుదల చేయడంలో మాత్రం యథార్థం. ముఖ్యంగా ాజవతీంఘుం వఒబఝ్ఆశీఅ ంఎష్ట్రవఎవ కింద దరఖాస్తు చేసుకొని నాటి కేసీఆర్ ప్రభుత్వం నుంచి మంజూరు పత్రాలు పొంది, రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రభుత్వంలో స్కాలర్‌షిప్‌ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల విషయంలో ఇది రూఢీ అయింది. అమెరికా తదితర దేశాల్లో ఉన్నత చదువులకు వెళ్లిన విద్యార్థులకు ముఖ్యంగా ట్రంప్ విధానాలు, ఇక్కడ మన ప్రభుత్వం ఉదాసీనతతో అడకత్తెరలో పోకచెక్కల్లా నలిగిపోతున్నారు. గత మూడేండ్లుగా అమెరికాలో ఎంఎస్ పూర్తి చేసి రెసిషన్ వల్ల ఉద్యోగాలు పొందలేక, మళ్లీ ఇతర కోర్సుల్లో జాయిన్ అవుతూ అప్పులు తీర్చడానికి మళ్లీ అప్పులు చేస్తున్నారు విదేశీ విద్యాపథకం కింద వెళ్లిన విద్యార్థులు. అక్కడ తిప్పలు పడుతూ నిరాశ నిస్పృహల్లో భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగాలు లేనందున, నెలవారీ ఖర్చుల కింద ఇక్కడి వారి తల్లిదండ్రులు బ్యాంకుల్లో బంగారం కుదువబెట్టి, బంధుమిత్రుల వద్ద చేయగలిగినంత అప్పు చేస్తూ నరకయాతన అనుభవిస్తున్నారు. కొండవీటి చాంతాడులా అప్పు పెరిగిపోతుంటే, గత నెల పాలకులు కనికరించి, విద్యార్థులకు మంజూరైన రూ.20 లక్షల్లో పాతిక భాగం అంటే ఐదు నుంచి ఏడు లక్షల వరకు వారి ఖాతాల్లో జమ చేశారు. కానీ ఇవే డబ్బులు రెండేండ్ల కిందటే వేస్తే అప్పు తాలూకు వడ్డీ భారం ఎంతో తగ్గి ఉండేది. రాష్ట్ర సర్కార్ నిధులు జమచేసినా ప్రయోజనం లేకపోయింది. కారణం.. అభ్యర్థులు అమెరికాలో ఉన్నత చదువులకు కేవలం యూనివర్సిటీ ఫీజుకే 40 నుంచి 60 లక్షల వరకు ఆయా బ్యాంకుల నుంచి రుణం తీసుకొన్నారు. రెండేండ్ల ఎంఎస్ కోర్సు అయ్యాక వర్క్ పర్మిట్ పొందినప్పటికీ ఉద్యోగాలు లేక అజ్ఞాతవాసం చేస్తున్నారు. ఇటీవల అమెరికా ప్రభుత్వం హెచ్-1 బీ వీసాలను ఏకంగా 2027 మార్చి వరకు ఇవ్వరాదని నిషేధించింది. దాంతో విద్యార్థుల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టయింది. ఆ దేశ నిబంధనల ప్రకారం విదేశీ విద్యార్థులు స్టూడెంట్ వీసా మీద ఉండరాదు. ఆర్థికమాంద్యం వల్ల కంపెనీలు ఉద్యోగ ప్రకటనలే చేయడం లేదు. అమెజాన్ వంటి కంపెనీలే భారీ ఎత్తున ఉద్యోగులను తొలగిస్తుండటంతో సర్వత్రా అభద్రతాభావం నెలకొన్నది. విద్యార్థులు ఉద్యోగాలు రాకపోవడంతో మరో కోర్సులో చేరుతున్నారు. దాంతో అప్పు మరింత అధికమవుతుండడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నది. కేసీఆర్ సర్కార్ 2023లో విదేశీ విద్యా పథకం కింద అర్హులైన పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఆ తర్వాత వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొదటి విడతగా అక్టోబర్ 2025లో ఒక్కొక్క విద్యార్థికి దాదాపు రూ.7 లక్షల చొప్పున అందించడంతో అవి వేడి పెనం మీద నీళ్లు చల్లినట్లయి, బ్యాంకు వడ్డీ చెల్లింపులకే సరిపోయింది. అసలు రుణం సర్పంలా బుసలు కొడుతున్నది. ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో మిగతా రూ.13 లక్షలను కూడా రెండవ విడతగా అందించి ఆదుకోవాలని విద్యార్థులు అభ్యర్థిస్తున్నారు. ఈ డబ్బులు సకాలంలో ఇస్తే కనీసం బ్యాంకు రుణాలను తీర్చుకోవాలని విద్యార్థులు భావిస్తున్నారు. అమెరికాలో ఉద్యోగాలు రాక స్వదేశానికి రావలసి వస్తే, వారికి తొలుత అప్పులే స్వాగతం చెప్తాయి. రుణాల తాలూకు నెలసరి వాయిదాలు యమపాశాలవుతున్నాయి. నిధుల విడుదలలో ఆలస్యం అయితే విద్యార్థుల భవితవ్యమే ప్రశ్నార్థకమవుతుంది. మున్సిపల్ ఎన్నికలు ముగిసిన అనంతరం రైతు భరోసా నిధులు విడుదల చేస్తానని సీఎం వాగ్దానం చేశారు. కానీ విదేశీ విద్యా పథకం కింద నిరుడు ఇవ్వాల్సిన నిధుల గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం విచారకరం. 2025 ఏప్రిల్‌లో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రూ.100 కోట్లు మంజూరు చేసినప్పటికీ అక్టోబర్ 2025 వరకు కేవలం రూ.25 కోట్లు మాత్రమే అందించారు. మిగిలిన రూ.75 కోట్లను సత్వరమే విడుదల చేసి, ఆదుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## బుల్లెట్ రైళ్ల కారిడార్లపై మరో ముందడుగు.. కేంద్రం నుంచి కీలక అప్డేట్



దేశవ్యాప్తంగా నిర్మించనున్న హైస్పీడ్ రైలు కారిడార్లపై కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. త్వరలో డీపీఆర్‌లను ఆమోదించనుంది. ఇప్పటికే ముంబై-అహ్మదాబాద్ రైల్ కారిడార్ పనులు ప్రారంభమయ్యాయి. మిగతా కారిడార్ల పనులను కూడా ఈ ఏడాదిలోనే ప్రారంభించేందుకు సిద్ధమవుతోన్నట్లు తెలుస్తోంది.బుల్లెట్ రైళ్ల కారిడార్లపై మరో ముందడుగు.. కేంద్రం నుంచి కీలక అప్డేట్కేంద్ర బడ్జెట్‌లో ఇటీవల ప్రవేశపెట్టిన హైస్పీడ్ రైలు కారిడార్లపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఏడు బుల్లెట్ రైలు కారిడార్లకు కేంద్రం ప్రణాళికలు ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. 2026 నుంచే వీటి నిర్మాణం మొదలుపెట్టేందుకు భారత రైల్వేలు ప్రణాళికలు వేస్తున్నాయి. ఖచ్చితమైన వ్యయ అంచనాల కోసం డీపీఆర్‌ను మార్చుతున్నాయి. సకాలంలో ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అప్పగించింది. ఈ కొత్త హైస్పీడ్ రైలు కారిడార్లు దేశంలోని ప్రధాన నగరాలను కలపనుండగా.. దాదాపు 4 వేల కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంటాయి. వీటి వల్ల పెట్టుబడులు కూడా పెరిగి ఉపాధి అవకాశాలు కూడా పెరగనున్నాయి.

### మొదలైన ప్రక్రియ

దేశ ప్రజలకు వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రీమియం ప్రయాణ అనుభవాన్ని అందించేందుకు ప్యాసింజర్ సేవల నమూనాను మార్చేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే వందే భారత్, వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రారంభించగా.. త్వరలో బుల్లెట్ రైళ్లను కూడా ప్రవేశపెట్టనుంది. ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా దేశంలో రైల్వే నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేయాలని చూస్తోంది. వందే భారత్ స్లీపర్ రైళ్ల రాకతో రాత్రిపూట ప్రయాణం మరింత మెరుగవ్వగా.. సామాన్యుల కోసం అమృత్ భారత్ రైళ్లను కూడా ప్రారంభించింది. ఈ క్రమంలో మరింత వేగవంతమైన ప్రయాణం అందించేందుకు ఇటీవల బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా ఏడు బుల్లెట్ రైలు కారిడార్లను కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం వీటి డీపీఆర్‌లను ఖరారు చేసే ప్రక్రియ చేపడుతోంది. అనంతరం టెండర్లను ఆహ్వానించి పనులు ప్రారంభించనున్నారు. తొలి కారిడార్‌ను అహ్మదాబాద్-ముంబై మధ్య నిర్మిస్తోంది. వచ్చే ఏడాదిలో ఇది అందుబాటులోకి రానుందని తెలుస్తోంది.

### గంటకు 300 కి.మీ వేగం

బుల్లెట్ రైళ్లు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. హైదరాబాద్-పుణె మార్గం మహారాష్ట్ర, తెలంగాణను కలుపుతుంది. 2 గంటల ప్రయాణ సమయాన్ని ఇది తగ్గిస్తుంది. ప్రయాణికులతో పాటు ఆర్థిక వ్యవస్థ కూడా ఈ లైన్ వల్ల మెరుగుపడనుంది. ఇక హైదరాబాద్-బెంగళూరు రైలు కారిడార్ ఏపీ మీదుగా కర్ణాటక వరకు ఉంటుంది. ఇది కర్ణాటక, తెలంగాణ, ఏపీలో ఐటీ, తయారీ, సేవా పరిశ్రమలకు ఉపయోగపడనుంది. రెండు గంటల ప్రయాణం సమయం దీని వల్ల తగ్గుతుంది. ఇక హైదరాబాద్-చెన్నై కారిడార్ ప్రయాణ సమయాన్ని దాదాపు గంట 13 నిమిషాలకు తగ్గిస్తుంది. దక్షిణ భారతదేశంలో హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌ను ఇది బలోపేతం చేస్తుంది. వీటి నిర్మాణంతో హైదర్షబాద్ రైల్వేలకు హాబ్‌గా మారనుంది. రవాణా వ్యవస్థ మెరుగుపడటంతో పాటు కొత్త కంపెనీలు రానున్నాయి. వీటి వల్ల యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పన జరగనుంది.

## విదేశాల నుంచి వచ్చేటప్పుడు మనతో ఎంత బంగారం తీసుకురావొచ్చో తెలుసా?





దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లినా పసిడి, వెండి ధరలు భగ్గుమంటున్నాయి. ఆకాశమే హద్దుగా వీటి ధరలు ఎగబాకుతున్నాయి. అయితే విదేశాల్లో గోల్డ్, వెండ్ ధరలు తక్కువ ధరలోనే ఉంటాయి. కానీ అక్కడి నుంచి మన దేశానికి తీసుకురావడానికి కొన్ని పరిమితులు ఉంటాయి. ఈ క్రమంలో లు, భారత సంతతికి చెందిన వ్యక్తులకు ఆభరణాలకు సంబంధించిన కొత్త నియమాలు కేంద్రం జారీ చేసింది.. బ్యాగేజ్ రూల్స్ 2026 ప్రకారం ఆభరణాలపై పాత విలువ పరిమితిని రద్దు చేశారు. బదులుగా బరువు ఆధారిత మినహాయింపు అమలు చేయాలని నిర్ణయించారు. విదేశాల నుంచి బంగారు ఆభరణాలను తీసుకువచ్చేటప్పుడు దాని ధర విషయంలో ఎయిర్‌పోర్టుల్లో పలు సమస్యలు తలెత్తేవి. తాజాగా మారిన నిబంధనలతో ధరకు బదులుగా బరువు ఆధారంగా పరిగణనలోకి తీసుకునే వ్యవస్థను అమలు చేస్తున్నారు. ప్రభుత్వం వివిధ వర్గాల ప్రయాణీకుల ఆధారంగా వేర్వేరు డ్యూటీ-ఫ్రీ అలవెన్స్ పరిమితులను నిర్ణయించింది. నివాసితులు, భారత సంతతికి చెందిన పర్యాటకులు, చెల్లుబాటు అయ్యే నాన్-టూరిస్ట్ వీసా కలిగి ఉన్న విదేశీయులు రూ. 75,000 వరకు డ్యూటీ-ఫ్రీ వస్తువులను తీసుకురావడానికి అనుమతి ఉంటుంది. గతంలో ఈ పరిమితి రూ. 50,000 వరకు ఉండేంది. విదేశీ సంతతికి చెందిన పర్యాటకులు ఎటువంటి డ్యూటీ చెల్లించకుండా రూ. 25 వేల వరకు విలువైన వస్తువులను తీసుకెళ్లవచ్చు. సిబ్బందికి డ్యూటీ-ఫ్రీ అలవెన్స్ పరిమితి రూ. 2,500గా ఉంది. కొత్త నిబంధనల ప్రకారం ఒక భారతీయుడు ఒక సంవత్సరం లేదా అంతకంటే ఎక్కువ కాలం విదేశాలలో ఉండి రాకపోకల సమయంలో ఆభరణాలను తీసుకువస్తుంటే బరువు ఆధారంగా సుంకం రహిత భత్యం ఉంటుంది. మహిళా ప్రయాణీకులు 40 గ్రాముల వరకు నగలను డ్యూటీ లేకుండా తీసుకురావచ్చు. ఇతర ప్రయాణీకులు 20 గ్రాముల నగలను డ్యూటీ లేకుండా తీసుకురావచ్చు. గతంలో అవి ఖరీదైన నగలు అయితే తక్కువ బరువు ఉన్నప్పటికీ సుంకం భారీగా ఉండేది. ఈ కొత్త వ్యవస్థ ప్రయాణీకుడికి, కస్టమ్స్ అధికారికి ఇద్దరికీ సరళంగా పారదర్శకంగా ఉంటుంది. ఆభరణాల బరువుకు సంబంధించి వివాదాలు కూడా చాలా మటుకు తగ్గుముఖం పడతాయి. అయితే ఈ మినహాయింపు వ్యక్తిగత ఆభరణాలకే పరిమితం అవుతుంది. ఎవరైనా బంగారు కడ్డీలు, నాణేలు, ఆభరణాలను ఏ రూపంలోనైనా విలువైన లోహాలను తీసుకువస్తుంటే వారికి సుంకం ఉండదు. కస్టమ్స్ వద్ద దానిని వెల్లడించాల్సి ఉంటుంది. కొత్త నిబంధనల ప్రకారం కనీసం ఒక సంవత్సరం లేదా అంతకంటే ఎక్కువ కాలం విదేశాలలో ఉన్న భారతీయులకు మాత్రమే ఇది వర్తిస్తుంది. కొత్త నిబంధనల ప్రకారం విదేశాల నుంచి నిర్ణీత బరువు కంటే ఎక్కువ బరువున్న ఆభరణాలను తీసుకువచ్చే భారతీయులు అదనపు ఆభరణాలపై కస్టమ్స్ సుంకం చెల్లించాల్సి ఉంటుంది. ఆభరణాలకు సంబంధించి ఈ కొత్త నియమ మార్పుల ఉద్దేశ్యం ఆభరణాల పరిమితిని పెంచడం కాదు. ఆభరణాలను తీసుకువచ్చే ప్రక్రియను సులభతరం చేయడం.

## క్రెడిట్ కార్డులు వాడేవారికి బాదుడు తప్పదు.. ఈ విషయాలు తెలుసుకోకపోతే నష్టపోతారు జాగ్రత్త..




క్రెడిట్ కార్డులు వాడుతున్నారా.. అయితే మీకో అలర్ట్. క్రెడిట్ కార్డులను వాడేవారు ప్రతీఒక్కరూ ఈ విషయాలు తెలుసుకోకపోతే నష్టపోవాల్సి ఉంటుంది. ఛార్జీలు, రివార్డ్స్ పాయింట్లు, జీఎస్టీ వంటి ఛార్జీల గురించి మీకు తెలుసా.. వేటికి ఎంత వసూలు చేస్తారనేది ఇప్పుడు చూద్దాం. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో చాలామంది క్రెడిట్ కార్డులు వాడుతున్నారు. సామాన్యులు కూడా క్రెడిట్ కార్డులను వినియోగిస్తున్నారు. అయితే వీటిని ఉపయోగించేవారి నుంచి బ్యాంకింగ్ సంస్థలు అనేక ఛార్జీలు వసూలు చేస్తూ ఉంటాయి. వీటి గురించి చాలామందికి అవగాహన లేక నష్టపోతూ ఉంటారు. వార్షిక మెయింటెన్స్ ఛార్జీలు, నగదు అడ్వాన్స్, ఆలస్యపు, జీఎస్టీ, వడ్డీ ఛార్జీల గురించి తెలియక ఇబ్బంది పడుతూ ఉంటారు. అసలు ఏ ఏ సమయాల్లో ఛార్జీలు విధిస్తారు.. ఎంతవరకు ఉంటుంది అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.

### వడ్డీ ఛార్జీలు ఇలా..

క్రెడిట్ కార్డు బిల్లును డ్యూ డేట్ కల్లా చెల్లించాలి. లేకపోతే ఆ తర్వాత వడ్డీ వసూలు చేస్తారు. భారత్‌లోని బ్యాంకులతో పాటు క్రెడిట్ కార్డులు జారీ చేసే సంస్థలు 18 నుంచి 42 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయి. దీంతో క్రెడిట్ కార్డు బిల్లు మిస్సయితే భారీగా వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. దీని వల్ల అప్పుల ఊబిలోకి వెళ్లే అవకాశముంది. ఇక మినిమం బ్యాలెన్స్ డ్యూ చెల్లించినా మిగిలిన బ్యాలెన్స్‌పై వడ్డీ పడుతుంది. ఇలా అయినా మీకే నష్టం జరుగుతుంది.

### జీఎస్టీ రుసుంలు

ఇక క్రెడిట్ కార్డు ట్రాన్సాక్షన్లపై జీఎస్టీ కూడా ఉంటుంది. జీఎస్టీ రేట్ల ప్రకారం వీటిని వసూలు చేస్తారు. వడ్డీతో పాటు లేట్ ఛార్జీలు, ఈఎంఐ ప్రాసెసింగ్ ఛార్జీలు, వార్షిక నిర్వహణ ఖర్చులపై జీఎస్టీ విధిస్తారు. జీఎస్టీ 18 శాతం వరకు ఉంటుంది. ఇక క్రెడిట్ కార్డుల ద్వారా చేసే టికెట్ల బుకింగ్, పెట్రోల్ చెల్లింపులకు జీఎస్టీతో పాటు అదనంగా సర్ ఛార్జి కూడా విధిస్తారు.

### బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ చేస్తే..

ఇక ఒక బ్యాంక్ క్రెడిట్ కార్డ్ నుంచి మరోక బ్యాంక్ క్రెడిట్ కార్డుకు బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ చేసినా ఛార్జీలు పడతాయి. ట్రాన్స్‌ఫర్ చేసే మొత్తంలో 1 నుంచి 3 శాతం వరకు ఈ ఛార్జీ ఉంటుంది.

### రివార్డ్స్ క్లెయిమ్‌కు కూడా..

ఇక క్రెడిట్ కార్డు వాడినప్పుడు మీకు వచ్చే రివార్డ్స్ పాయింట్స్‌ను రిడెంప్షన్ చేసుకునేందుకు కూడా అదనపు ఛార్జీల వసూలు ఉంటుంది. రివార్డుల మొత్తం విలువ నుంచి ఈ ఛార్జీలను తీసుకుంటారు.

### వీటికి కూడా ఫీజులు

ఇక క్రెడిట్ కార్డ్ పోయినప్పుడు కొత్త క్రెడిట్ కార్డుకు దరఖాస్తు చేసుకుంటాం. దీంతో కార్డు రీప్లేస్‌మెంట్ ఫీజ కింద రూ.100 నంచి రూ.500 వరకు వసూలు చేస్తారు. కొన్ని సంస్థలు ఉచితంగా కొత్త క్రెడిట్ కార్డును జారీ చేస్తున్నాయి. ఇక మీ క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్ ఫిజికల్ కాపీకి రిక్వెస్ట్ పెట్టినా ఛార్జీలు వసూలు చేస్తారు. ఒక్కొ స్టేట్‌మెంట్‌కు రూ.50 నుంచి రూ.200 ఛార్జీ ఉంటుంది.

## పాన్ కార్డు వాడేవారికి గుడ్‌న్యూస్.. మారనున్న రూల్స్.. ఏప్రిల్ 1 నుంచి మార్పులు ఇవే..




పాన్ కార్డు వాడేవారికి ఊరట లభించింది. ఇప్పటివరకు పాన్ కార్డు ద్వారా చేసే పేమెంట్స్‌కు సంబంధించిన లిమిట్‌లలో ఆదాయపు పన్ను శాఖ మార్పులు చేసింది. బిల్లులు, నగదు డిపాజిట్ల లిమిట్‌ను మరింత పెంచింది. ఏప్రిల్ 1 నుంచి ఈ కొత్త నియమాలు అమల్లోకి రానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను నియమాలను మార్చుతోంది. ఇప్పటివరకు ఉన్న నిబంధనల్లో కీలక మార్పులు చేయనుంది. ఇందులో భాగంగా పాన్ కార్డు రూల్స్‌లో కూడా భారీ మార్పులు జరగనున్నాయి. పాన్ కార్డు ఉపయోగించి చేసే నగదు డిపాజిట్ నుంచి భోజన భత్యం వరకు అనేక నియమాలు మారనున్నాయి. ఆదాయపు పన్ను నియమాలు 2026 ఇప్పటికే ఉన్న నిబంధనలను క్రమబద్ధీకరిస్తోంది. పాన్ లావాదేవీలు పెంపు, పన్ను చెల్లింపుదారులకు ముందే నింపిన ఫారమ్‌లు, యజమాని భత్యాలలో సర్దుబాట్లు వంటి ప్రయోజనాలు ఇందులో ఉన్నాయి. వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### రూ.లక్షకు పెంపు

ఇప్పటివరకు ఏదైనా బ్యాంకులో ఒకరోజు రూ.50 వేలు లేదా అంతకంటే ఎక్కువ నగదు డిపాజిట్ చేయాలంటే పాన్ కార్డు సమర్పించాలి. ఇప్పుడు ఆ పరిమితిని ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మంట్ రూ.లక్షకు పెంచింది. దీంతో ఇక నుంచి బ్యాంకులో ఒకరోజులో రూ.లక్ష కంటే ఎక్కువ నగదు డిపాజిట్ చేయాలంటే పాన్ కార్డు అవసరం. ప్రస్తుతం నియమాలపై ప్రజల సలహాలను ఆదాయపు పన్ను శాఖ కోరుతోంది. అనంతరం ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు చేయనుందని తెలుస్తోంది.

### మీల్స్ అలవెన్స్ పెంపు

కంపెనీలు ఉద్యోగులకు మీల్స్ అలవెన్స్ అందిస్తూ ఉంటాయి. ఉద్యోగులకు ఆహార ఖర్చుల కోసం అందించే స్టైఫండ్ ఇది. ఈ మీల్స్ అలవెన్స్‌ను నాలుగు రెట్లు పెంచనున్నారు. ఇప్పుడు రూ.50గా ఉండగా.. దీనిని రూ.200కి పెంచనున్నారు. మార్చి ప్రారంభంలో దీనిని నోటిఫై చేయనున్నారని తెలుస్తోంది. ఇక ఉద్యోగులకు కంపెనీలు అందించే అలవెన్స్‌లను ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా మార్చనున్నారు. పిల్లల విద్య, వ్యక్తిగత ఖర్చుల అలవెన్స్‌లు కూడా ఇందులో ఉండనున్నాయి. వీటి వల్ల ఉద్యోగులకు ప్రయోజనం జరగనుంది.

### ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ సులువు

ఇక ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ దాఖలు మరింత సులువు కానుంది. ఇందుకోసం ముందే నింపిన ఫారమ్‌లను చెల్లింపుదారులకు అందించనున్నారు. వీటిలోని వివరాలను మార్చుకోవచ్చు లేదా ఆమోదించవచ్చు. పేపర్‌లెస్ విధానలో ఐటీఆర్ ప్రక్రియను సులభవంగా అందించడానికి దీనిని రూపొందించనున్నారు. రిటర్న్ కోసం పేపర్లు ఉపయోగించే పనిని 50 శాతం తగ్గించారు.

### వీటికి పాన్ అవసరం

ఇక నుంచి రూ.5 లక్షలకుపైగా ధరతో కొనుగోలు చేసే మోటార్ వెహికల్స్‌కు మాత్రమే పాన్ అవసరం. ప్రస్తుతం లిమిట్స్‌తో సంబంధం లేకుండా అన్ని వెహికల్స్ కొనుగోలుకు పాన్ అందించాలి. ఇప్పుడు ఆ నిబంధన తొలగించారు. ఇక హోటల్,రెస్టారెంట్, కన్వెన్షన్ వంటి బిల్లులకు రూ.లక్ష దాటితేనే పాన్ అవసరం పడుతుంది. ఇప్పటివరకు ఈ లిమిట్ రూ.50 వేలుగా ఉండేది.

## ఆడవారికి ఇన్సూరెన్స్ లేకపోతే కొంప మునిగినట్టేనా? ఇది తెలిస్తే వెంటనే పాలసీ తీసుకుంటారు!




ప్రతి ఇంట్లో మహిళలే అందరి ఆరోగ్యాన్ని చూస్తుంటారు. కానీ తమ సొంత ఆరోగ్యం దగ్గరకు వచ్చేసరికి మాత్రం నిర్లక్ష్యం చేస్తుంటారు. కుటుంబం, ఉద్యోగం, పిల్లల బాధ్యతల్లో పడి తమకు ఏదైనా సమస్య వచ్చినా ఆలస్యం చేయడం మహిళలకు అలవాటు. దీనికి తోడు పెరిగిన వైద్య ఖర్చులు మధ్యతరగతి మహిళలకు పెద్ద సవాలుగా మారాయి. అందుకే, మహిళలు కేవలం కుటుంబ సభ్యుల పైనే ఆధారపడకుండా తమకంటూ ప్రత్యేకంగా ఆరోగ్య బీమా కలిగి ఉండటం నేడు తప్పనిసరి. సాధారణ చెకప్‌ల నుంచి ఆకస్మిక శస్త్రచికిత్సల వరకు అయ్యే ఖర్చులు మీ పొదుపు మొత్తాన్ని ఆవిరి చేయగలవు. గర్భధారణ సమయంలో వచ్చే సమస్యలు కావచ్చు లేదా వయసు పెరిగే కొద్దీ వచ్చే మెనోపాజ్ సంబంధిత ఇబ్బందులు కావచ్చు.. వీటన్నిటికీ ఆర్థికంగా సిద్ధంగా ఉండటం అవసరం. మహిళల జీవితంలో ఆరోగ్య బీమా ఎందుకు కీలక పాత్ర పోషిస్తుందో వివరించే ఐదు బలమైన కారణాలను ఇప్పుడు చూద్దాం.

### మహిళలకు ఆరోగ్య బీమా ఎందుకు ముఖ్యమైనది?

**1. మారుతున్న జీవిత దశలకు రక్షణ:**

మహిళల శరీరంలో వయసుతో పాటు అనేక మార్పులు వస్తుంటాయి. నెలసరి సమస్యలు, గర్భధారణ, ప్రసవం తర్వాత సంరక్షణ వయసు పెరిగే కొద్దీ వచ్చే ఎముకల సమస్యలు.. ఇలా ప్రతి దశలో వైద్య సహాయం అవసరమవుతుంది. ఆరోగ్య బీమా ఉంటే ఎటువంటి ఆలస్యం లేకుండా చికిత్స పొందే అవకాశం ఉంటుంది.

### 2. కష్టపడి దాచుకున్న పొదుపుకు భరోసా:

ఈ రోజుల్లో ఒక చిన్న ఆసుపత్రి బిల్లు కూడా వేలల్లో ఉంటోంది. కుటుంబ అవసరాల కోసం లేదా భవిష్యత్తు కోసం మీరు దాచుకున్న డబ్బు వైద్య ఖర్చులకే సరిపోవచ్చు. అదే బీమా ఉంటే, ఇన్సూరెన్స్ కంపెనీ ఆ బిల్లులను భరిస్తుంది, మీ పొదుపు సురక్షితంగా ఉంటుంది.

**3. నివారణే ప్రాథమిక చికిత్స:**

క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులను ముందే గుర్తిస్తే ప్రాణాపాయం తప్పుతుంది. బీమా కంపెనీలు అందించే ఉచిత వార్షిక హెల్త్ చెకప్‌లు మరియు స్క్రీనింగ్ పరీక్షల ద్వారా మీ ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవచ్చు. ఖర్చు అవుతుందని భయపడకుండా పరీక్షలు చేయించుకోవడానికి ఇది తోడ్పడుతుంది.

### 4. కుటుంబ బాధ్యతల్లో ఆసరా:

మహిళలు తమ ఆరోగ్యం కంటే కుటుంబానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఇంట్లో అందరికీ ఇన్సూరెన్స్ ఉన్నప్పుడు, మహిళలు కూడా ఆ కవరేజీలో ఉంటే తమ చికిత్స కోసం కుటుంబంపై అదనపు ఆర్థిక భారం పడుతుందన్న ఆందోళన వారికి ఉండదు. తద్వారా వారు సకాలంలో వైద్యుడిని సంప్రదించగలరు.

**5. ఆర్థిక స్వేచ్ఛ నియంత్రణ:**

ఒక ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు డబ్బు కోసం ఇతరులపై ఆధారపడటం మానసిక ఒత్తిడిని కలిగిస్తుంది. ఆరోగ్య బీమా మహిళలకు ఆర్థికంగా స్వతంత్రంగా ఉండేలా చేస్తుంది. ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే ధైర్యంగా నిర్ణయం తీసుకోవడానికి, మెరుగైన చికిత్స పొందడానికి ఇది ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది.

## ఈ 5 ఉచిత యాప్‌లు ఫోన్‌లో ఉంటే మీ సమయం ఆదా.. ఒకే క్లిక్‌తో అన్నీ సర్వీసులు




కేంద్ర ప్రభుత్వ సేవలు సులువుగా పేపర్‌లెస్ విధానంలో పొందేందుకు ఐదు యాప్‌లు ఉచితంగా సేవలు అందిస్తున్నాయి. వీటి ద్వారా మీరు ఇంట్లోనే ఉండి మొబైల్ ద్వారా ఏ పనైనా ఈజీగా చేసుకోవచ్చు. ఈ యాప్‌లు దేశంలోని ప్రజలందరికీ ఉపయోగపతాయి. వీటిని ఒక్కసారైనా వాడి ఉంటారు. ఇండియాలో దాదాపు 145 కోట్ల మంది జనం ఉన్నారు. ఒకేసారి అందరికీ సేవలు అందించాలంటే కష్టతరమైన ప్రక్రియ. దీంతో ప్రజలకు వేగవంతమైన సర్వీసులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక యాప్‌లను తీసుకొస్తుంది. వీటి వల్ల ప్రజలు క్యూలైన్లలో నిల్చోవాల్సిన అవసరం లేకుండా మొబైల్ నుంచే ప్రభుత్వ సేవలన్నీ పొందవచ్చు. పేపర్‌లెస్ విధానంలో డిజిటల్‌గా అవసరమైన సేవలను యాక్సెస్ చేయడానికి ఈ యాప్‌లు ఉపయోగపడతాయి. కొత్త ఆధార్ యాప్, డిజిలాకర్ నుంచి డిజియాత్ర వరకు దేశంలోని ప్రజలకు ఉపయోగపడే ఐదు ఉచిత యాప్‌ల గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.

**ఉమాంగ్**

యూనిఫైడ్ మొబైల్ అప్లికేషన్ ఫర్ న్యూఏజ్ గవర్నెన్స్(ఉమాంగ్) అనేది కేంద్ర ప్రభుత్వ యాప్. ఇందులో అనేక కేంద్ర ప్రభుత్వ సేవలను ఉచితంగా పొందవచ్చు. ఆరోగ్యం, విద్య, యుటిలిటీ, ఉపాధి, ఇతర సేవలను పొందటానికి ఉపయోగించుకోవచ్చు. ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించాల్సిన అవసరం లేకుండా సమయాన్ని ఈ యాప్ ఆదా చేస్తుంది. ఎక్కడైనా, ఎప్పుడైనా ఈ యాప్ ద్వారా డిజిటల్ గవర్నెన్స్ పొందవచ్చు.

**ఆధార్ యాప్**

ఆధార్ పేరుతో ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొత్త యాప్‌ను లాంచ్ చేసింది. ఇందులో ఆధార్‌కు సంబంధించిన అన్నీ ఆన్‌లైన్ సేవలు ఈజీగా పొందవచ్చు. క్యూఆర్ కోడ్ ద్వారా ఆధార్ సమాచారం, గుర్తింపు ధృవీకరణ కోసం ఇది ఉపయోగపడుతుంది. ఇక మొబైల్, అడ్రస్ అప్డేట్, కుటుంబసభ్యుల ఆధార్ వివరాలు ఒకచోట ఉంచుకోవడం, బయోమెట్రిక్ లాక్ లేదా అన్ లాక్ చేసుకోవడం వంటి సౌకర్యాలు ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి.

**డిజిలాకర్**

ముఖ్యమైన పత్రాలను ఆన్‌లైన్‌లో భద్రపర్చుకునేందుకు, యాక్సెస్ చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను ప్రవేశపెట్టింది. సర్టిఫికేట్లు,గుర్తింపు ధృవీకరణ పత్రాలు, అధికారిక రికార్డులను డిజిటల్ రూపంలో ఇందులో ఉంచుకోవచ్చు. ఫిజికల్ డాక్యుమంట్ల అవసరాన్ని ఇది తగ్గిస్తుంది. ఇక ఫైల్స్‌ను సులభంగా, సురక్షితంగా పంచుకునేందుకు ఇది సహాయపడుతుంది. కాగిత రహిత వెరిఫికేషన్ ప్రక్రియకు ఇది ఉయోగపడుతుంది.

**డిజియాత్ర**

డిజియాత్ర అనేది ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణాలను వేగవంతం చేయడానికి ముఖ గుర్తింపుకు ఉపయోగపడే యాప్. ప్రయాణికులు డిజియాత్ర ఐడీని క్రియేట్ చేసుకోవచ్చు. ఫిజికల్ డాక్యుమెంట్లను చూపించకుండానే బోర్డింగ్ ప్రక్రియ పూర్తవుతుంది. క్యూలను తగ్గించడంతో పాటు సమయం ఆదా అవుతుంది. అలాగే భద్రతను కూడా మెరుగుపరుస్తుంది. సౌకర్యవంతమైన విమాన ప్రయాణం కోసం ప్రయాణికుల డేటా సురక్షితంగా ఉండేందుకు ఇది సహాయపడుతుంది. ఈ ఐదు యాప్‌లను ఉచితంగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని మీ మొబైల్ నెంబర్‌తో లాగిన్ అయ్యి ఉపయోగించుకోవచ్చు. సామాన్యులు కూడా అర్థం చేసుకునేలా ఇంటర్‌ఫేస్ సింపుల్‌గా ఉంటుంది.



## 'క' దర్శకులతో సాయితేజ్

రెండేళ్లుగా 'సంబరాల ఏటిగట్టు' సినిమాతోనే ప్రయాణం చేస్తున్నారు కథానాయకుడు సాయిదుర్గాతేజ్. భారీ స్థాయిలో రూపొందుతున్న ఆ చిత్రం తుదిదశకు చేరుకోవడంతో, ఇప్పుడు ఆయన కొత్త సినిమాని ఆరంభించడానికి సిద్ధమయ్యారు. 'క' సినిమాతో విజయాన్ని అందుకున్న దర్శకద్వయం సుజీత్, సందీప్ చెప్పిన కథకు సాయిదుర్గా తేజ్ పచ్చజెండా ఊపారు. ఈ కలయికలో సినిమా ఉగాది రోజున ప్రారంభం కానున్నట్టు సమాచారం. 'మన శంకరవరప్రసాద్‌గారు'తో విజయాన్ని అందుకున్న షైన్ స్క్రీన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనుంది.

## అరుదైన సినిమా 'మృత్యుంజయ్'



"పాటలు లేకుండా, కథానాయికలు లేకుండా, హాస్యం లేకుండా నిజాయతీగా రూపొందే థ్రిల్లర్ సినిమాలు తెలుగులో అరుదు. అలాంటి ఓ అరుదైన సినిమానే మా 'మృత్యుంజయ్'. ఇందులో నా నటన కూడా కొత్తగా ఉంటుంది" అన్నారు శ్రీవిష్ణు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రమిది. రెబా మోనికా జాన్ ముఖ్యభూమిక పోషించారు. హుసేన్ షా కిరణ్ దర్శకత్వం వహించారు. సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం టీజర్‌ని ప్రముఖ దర్శకుడు రాజమౌళి విడుదల చేశారు.



# నిక్ నాకు ఎప్పుడూ ప్రేరణే..
# ట్రోల్స్‌కు ప్రియాంక చోప్రా స్ట్రాంగ్ రిప్లై!

బాలీవుడ్ నుండి హాలీవుడ్ వరకు తన నటన, అభినయంతో ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్న నటి ప్రియాకం చోప్రా. వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ... తన వ్యక్తిగత జీవితాన్ని, వృత్తిపరమైన బాధ్యతలను బ్యాలెన్స్ చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ఎస్ ఎస్ రాజమౌళి దర్శకత్వంతో సూపర్ స్టార్ మహేష్ బాబుతో కలిసి రూపుదిద్దుకుంటున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'లో ప్రియాంక చోప్రా నటిస్తుంది. తాజాగా ఈ బ్యూటీ తన వ్యక్తిగతం జీవితంపై వస్తున్న ట్రోల్స్ కు గట్టిగా కౌంటర్ ఇచ్చిపడేసింది.

నిక్ జోనాస్ తో పెళ్లి అయ్యి ఎనిమిదేళ్లు పూర్తైన సందర్భంగా తమ వివాహంపై వచ్చిన ట్రోల్స్ ను లెక్క చేయుబోనని నటి ప్రియాంక చోప్రా స్పష్టంచేసింది. 2018లో వెళ్లి జరిగినప్పటి నుంచి వయసు తేడా. వేర్వేరు దేశాలు, వేర్వేరు మతాలు అనే కారణాలతో తమ సంబంధంపై చాలామంది మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేసింది. మొదట్లో ఆ మాటలు తనకు చాలా బాధ పెట్టాయని, కానీ ఇప్పుడు వాటిని పట్టించుకోవడం మానేశానని చెప్పుకొచ్చింది. "ఇప్పటికీ మా పెళ్లి చెడిపోతుందని ఎదురు చూస్తే..? అది వాళ్ల ఇష్టం. నేను ఇక దానిపై ఆలోచించను అని స్పష్టం చేశారు.

**నిక్ తనకు ప్రతిరోజూ ప్రేరణే..**

తాను, నిక్ ఇద్దరం బయట మాటలకన్నా ఒకరినొకరు నమ్ముకున్నామని ప్రియాంక తెలిపారు. నిక్ లో ఉన్న నిజాయితీ, సూటితనం తనకు చాలా ఇష్టమని చెప్పారు. చిన్న వయసులోనే కెరీర్ మొదలుపెట్టిన నిక్ స్వభావం తనకు ప్రతిరోజూ ప్రేరణనిస్తుందని అన్నారు. ఆరు నెలల్లోనే పెళ్లి నిర్ణయం తీసుకోవడం తనకే ఆశ్చర్యంగా అనిపించిందని ప్రియాంక వెల్లడించింది. రాజస్థాన్ లో 2018లో పెళ్లి చేసుకున్న ఈ జంటకు 2022లో కుమార్తె మాల్టీ మేరీ చోప్రా జోనాస్ జన్మించింది. ప్రస్తుతం ప్రియాంక వారణాసి తెలుగు సినిమాతో పాటు సిటాడెల్ సీజన్-2, ది బన్, హెడ్స్ ఆఫ్ స్టేట్ వంటి పలు ప్రాజెక్టుల్లో సటిస్తోంది.

## వెంకీ అట్లూరితో నాని మూవీకి ప్లాన్




స్టార్ కథానాయకుడు నాని ప్రస్తుతం వరుస హిట్లతో జోష్ మీద ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ది ప్యారడైజ్ సినిమాతో బిజీగా ఉన్న నాని ఆ తర్వాత సుజీత్ దర్శకత్వంలో ఒక సినిమా చేయబోతున్నాడు. అయితే ఈ రెండు చిత్రాలు కాకుండా మరో క్రేజీ దర్శకుడితో నాని చేతులు కలపబోతున్నట్లు తెలుస్తుంది. 'సార్', 'లక్కీ భాస్కర్' వంటి వైవిధ్యమైన చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు వెంకీ అట్లూరితో నాని సినిమా చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించబోతున్నాడు. 'జెర్సీ' వంటి నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమా తర్వాత నాని ? సితార కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలు త్వరలోనే చిత్రబృందం వెల్లడించనుంది. ప్రస్తుతం నాని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం మార్చి 26, 2026న విడుదలయ్యే అవకాశం ఉంది. దీని తర్వాత సుజీత్ దర్శకత్వంలో మరో సినిమా చేయనున్నారు. మరోవైపు వెంకీ అట్లూరి ప్రస్తుతం సూర్య హీరోగా 'విశ్వనాథన్ అండ్ సన్స్'చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఈ కమిట్‌మెంట్లు అన్నీ పూర్తయిన తర్వాత, 2026 ద్వితీయార్థంలో నాని ? వెంకీ అట్లూరి ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.



## శక్తిమంతమైన కథలో?

'టాక్సిక్' చిత్రంలో నదియాగా ప్రేక్షకుల్ని అలరించడానికి సన్నద్ధమవుతోంది అందాల తార కియారా అద్వాణీ. ప్రస్తుతం మాతృత్వపు దశను ఆస్వాదిస్తున్న ఈమె.. ఇప్పుడు ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. "బరేలీ కీ బర్ఫీ', 'పంగా' లాంటి హిట్ చిత్రాలను రూపొందించిన దర్శకురాలు అశ్వినీ అయ్యర్ తివారీతో ఓ ప్రాజెక్టు కోసం చేతులు కలిపిందట కియారా. "ఇప్పుడు రాబోయే ప్రాజెక్టు ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. ఇప్పటికే దీని గురించి కియారా, దర్శకురాలి మధ్య చర్చలు పూర్తయ్యాయి. ఈ చిత్రాన్ని శక్తిమంతమైన మహిళా ప్రాధాన్య కథగా తీర్చిదిద్దనున్నారు. కియారా 'టాక్సిక్' చిత్ర షూటింగ్‌ను పూర్తి చేసిన తర్వాత ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభించాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. త్వరలో ఈ ప్రాజెక్టు గురించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయ"ని కియారా సన్నిహిత వర్గాలు తెలిపాయి.

## అప్పలసూరిగా జగపతిబాబు




ఒకప్పటి ఫ్యామిలీ హీరో, ప్రస్తుతం స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా దూసుకుపోతున్న జగపతి బాబు తాజాగా తన లుక్‌తో అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా కోసం ఆయన పూర్తిగా మారిపోయిన కొత్త రూపం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోను చూసిన నెటిజన్లు ఇతను జగపతి బాబా అంటున్నారు. ఈ చిత్రంలో జగపతి బాబు 'అప్పల సూరి' అనే కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఆ పాత్ర కోసం ఆయన బాగా బరువు తగ్గి, వయసు ముదిరిన వ్యక్తిలా కనిపించేలా ప్రత్యేక మేకోవర్ తీసుకున్నట్టు తెలుస్తోంది. తాజాగా విడుదలైన సెట్స్ ఫోటోలో దర్శకుడు బుచ్చిబాబుతో మాట్లాడుతున్న జగపతి బాబు రూపం చూసి అభిమానులు షాక్ అవుతున్నారు. ఏ కోణంలో చూసినా ఆయన గుర్తుపట్టలేనంతగా మారిపోయారని పలువురు అభిప్రాయపడుతున్నారు. జగపతి బాబు బర్త్ డే సందర్భంగా ఈ పిక్ రిలీజ్ చేశారు మేకర్స్. గతంలో కూడా జగ్గూ భాయ్‌కి సంబంధించిన పిక్ ఒకటి షేర్ చేయగా, అది కూడా నెట్టింట వైరల్ అయింది. ఇక జగపతి బాబు గతంలో కూడా పాత్ర కోసం తన లుక్‌ను పూర్తిగా మార్చుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే ఈసారి 'పెద్ది' కోసం తీసుకున్న మేకోవర్ మాత్రం మరింత విభిన్నంగా ఉండటంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఒకప్పుడు హీరోగా మెప్పించిన ఆయన, తర్వాత విలన్ మరియు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించి వరుస విజయాలతో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇక రామ్ చరణ్ – జగపతి బాబు కాంబినేషన్ ఇప్పటికే 'రంగస్థలం' చిత్రంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే. మరోసారి ఈ జోడీ 'పెద్ది'లో కనిపించబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతుండగా, జగపతి బాబు పోషిస్తున్న పాత్ర ఎలా ఉండబోతుందో తెలుసుకోవాలనే ఉత్సుకత సినీ ప్రియుల్లో నెలకొంది. మొత్తానికి, 'పెద్ది' కోసం జగపతి బాబు చేసిన ఈ భారీ మేకోవర్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది.

# ప్రశాంతంగా ముగిసిన బార్ కౌన్సిల్ ఎన్నికలు
## 106 ఓట్లలో 100 ఓట్లు పోల్



పత్తికొండ : రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బార్ కౌన్సిల్ ఎన్నికలు శుక్రవారం పత్తికొండలో బార్ కౌన్సిల్ లో ప్రశాంతంగా జరిగాయి. శుక్రవారం పత్తికొండ బార్ అసోసియేషన్ లో నిర్వహించిన పోలింగ్లో 106 మంది ఓటర్లు ఉండగా వీరిలో వందమంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొదటి ప్రాధాన్యత, రెండో ప్రాధాన్యత క్రమంలో అభ్యర్థులకు ఓట్లు వేయించాలని అభ్యర్థులు విన్నవించుకున్నారు. అయితే ఓటర్లు మాత్రం ఎవరికి ప్రాధాన్యత ఓటు వేశారన్నది బ్యాలెట్ పేపర్లో నిక్షిప్తమైంది. 106 మందిలో ఇద్దరు న్యాయవాదులు మృతి చెందగా మిగతా నాలుగు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు రాలేదు. సాయంత్రం ఐదు గంటల వరకు ఓటర్ల నిర్వహణ ప్రక్రియ నిర్వహించి బ్యాలెట్ బాక్స్ ను రాష్ట్ర బార్ కౌన్సిల్ కు పంపిస్తున్నట్లు ఎన్నికల విధులు నిర్వహించిన అధికారి వై. మధు బాబు తెలిపారు.

# శివరాత్రి శివ దర్శనం జరజాగ్రత్త
## టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జయన్న



పత్తికొండ : మహాశివరాత్రి సందర్భంగా శివ దర్శనం వెళ్లే భక్తులు జర జాగ్రత్తగా ఉండాలని పత్తికొండ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జయన్న పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పత్తికొండ మండల పరిధిలోని చుట్టుముట్టున్న గ్రామాలలో శివాలయాలు ముఖ్యంగా పది ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి పత్తికొండ హైవే ప్రక్కన ఉన్న శివాలయం మరియు రామ లింగేశ్వర స్వామి శివాలయం ముఖ్యమైనవి పత్తికొండ హైవే పక్కన ఉన్న శివాలయం ప్రత్యేకంగా వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి వాహనాలు పార్కింగ్లో చెయ్యాలి. రవాణాకు ఎటువంటి ఇబ్బంది కలిగించకూడదు. పట్టణ ప్రజలు శివాలయం నందు దర్శనం చేసుకునే వేళలో మీ ఆభరణాలు పట్ల జాగ్రత్త వహించవలెను. హైవే రోడ్డుపైన వాహనదారులు హెల్మెట్ ధరించి లేక మాస్కుని ధరించి దగ్గరకు వచ్చి మాట్లాడితే మీరు దూరంగా వెళ్లి జాగ్రత్త ఉండవలెను. మీకు వారిపై అనుమానం వస్తే పోలీసు వారికి సమాచారం అందించండి. ముఖ్యంగా పట్టణ ప్రజలు బంధువుల ఊరికి వెళ్లిన యాత్రలకు వెళ్లిన పోలీసు వారికి తెలిపినచో మీ ఇంటికి సీసీ కెమెరాలు బిగించబడును. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ జయన్న తెలియజేశారు.

# భూలింగేశ్వర స్వామి సన్నిధానంలో అన్నదానం



ఓ డీ చెరువు : మండలంలోని గాజుకుంటపల్లి సమీపంలో వెలసిన భూలింగేశ్వర స్వామి సన్నిధానంలో మాతాజీ రత్నమ్మ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మాతాజీ రత్నమ్మ ఆధ్వర్యంలో ప్రారంభించిన నిత్యాన్నదాన కార్యక్రమములో తొలిరోజు విశ్రాంత ఏ టీ ఓ ఆనే శ్రీరాములు 75వ జన్మదినం సందర్భంగా శ్రీరాములు సతీమణి నారాయణమ్మ మరియు కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. మాతాజీ రత్నమ్మ మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి నిత్యాన్నదానం విజయవంతమయ్యేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గోరంట్ల ఎస్సీ కాలనీలో "బడిని కాపాడుదాం"
# కార్యక్రమం విజయవంతం

గోరంట్ల( : గోరంట్ల ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ఎంపీపీ పాఠశాలలో "బడిని కాపాడుదాం" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ చిన్నారులకు





అడ్మిషన్ కార్యక్రమం నిర్వహించి, వారికి స్లేట్లు, పెన్సిళ్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్ఎం ప్రదర్శనను తల్లిదండ్రులు, పిల్లలు ఆసక్తిగా వీక్షించి ప్రశంసించారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు శ్రీ జాన్ రెడ్డి సర్, కె. గోపాల్ సర్ హాజరై ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు. అలాగే ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగరాణి, ఉపాధ్యాయురాలు కృష్ణకుమారి, అంగన్వాడీ టీచర్ మంజుల, స్కూల్ చైర్మన్ రామాంజనేయులు, సీఆర్పీ వెంకటనారాయణ సర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్
# విద్యార్థినికి అంతర్జాతీయ అవకాశం



పుట్టపర్తి : పుట్టపర్తి సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని షేక్ కరీష్మకు అరుదైన అంతర్జాతీయ అవకాశం లభించినట్లు సంస్కృతి కళాశాల యాజమాన్యం తెలిపింది. శుక్రవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆస్ట్రియా దేశానికి చెందిన ఆర్ ఐ ఎస్ సి సంస్థతో కలిసి నిర్వహిస్తున్న ఆర్ ఐ టి ప్రోగ్రామ్ ద్వారా ప్రతి ఆరు నెలలకు ఒక విదేశీ ఫ్యాకల్టీ క్యాంపస్కు వచ్చి విద్యార్థులకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఈ ప్రోగ్రామ్లో మొదటి సంవత్సరం నుంచే ఎంపికైన కరీష్మ నాలుగు సంవత్సరాల పాటు నాలుగు మాడ్యూళ్లను విజయవంతంగా పూర్తి చేసి కోడింగ్లో మొదటి స్థానాన్ని సాధించిందన్నారు. ఆ విద్యార్థిని ప్రతిభకు గుర్తింపుగా ఆర్ ఐ ఎస్ సి ఆస్ట్రియా సంస్థలో ఇంటర్న్షిప్తో పాటు రూ.19,60,000 వార్షిక ప్యాకేజీతో ఉద్యోగ ఆఫర్ లభించినట్లు తెలిపారు.

వెంగళమ్మచెరువు గ్రామానికి చెందిన కరీష్మ తండ్రి రోజువారీ కూలీగా, తల్లి టైలర్గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారన్నారు. నలుగురు అక్కచెల్లెళ్లలో ఒకరైన ఆమె ప్రభుత్వ పాఠశాలలో చదువు పూర్తి చేసి కష్టపడి ఈ స్థాయికి చేరుకోవడం ఎంతో ప్రేరణాత్మకం అని కళాశాల యాజమాన్యం పేర్కొన్నారు. ఈ ఘనతతో కరీష్మ కుటుంబ సభ్యులు ఎంతో ఆనందం వ్యక్తం చేయగా, సంస్కృతి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు ఆమెను అభినందించారు. ప్రస్తుతం ఇలాంటి ఆర్ ఐ టి అంతర్జాతీయ ప్రోగ్రామ్ అవకాశం మొత్తం ఆంధ్రప్రదేశ్లో సంస్కృతి కళాశాలకే ప్రత్యేకం కావడం గర్వకారణమని ఆ కళాశాల యాజమాన్యం తెలిపారు.

# చలో మంగళగిరి చేనేత గర్జనకు పిలుపు




యాడికి : ఈ నెల 22న జరిగే చలో మంగళగిరి చేనేత గర్జనను జయప్రదం చేయాలని చేనేత నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం యాడికి మండల కేంద్రంలోని మార్కండేయ స్వామి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో నేతన్నలకు రూ.2000 కోట్ల బడ్జెట్ కేటాయింపు, నేతన్న నేస్తం రూ.25 వేల సహాయం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ముడి పట్టు 50 శాతము రాయితీ, ఆధునిక మగ్గ పరికరాలకు 90 శాతము సబ్సిడీ, మహిళలకు ప్రసూతి భత్యం, వర్క్ షెడ్, పింఛన్, జీఎస్టీ రద్దు, ముద్ర రుణాలు, 1985 రిజర్వేషన్ చట్టం అమలు వంటి డిమాండ్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పామిశెట్టి గోవిందు, సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ, జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ మామిళ్ళ నారాయణస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ సోమశేఖర్, రామరాజు తదితరులు పాల్గొన్నారు

## జిల్లాలో చెరువులు, వాగుల సంరక్షణకు
# పటిష్ట చర్యలు తీసుకోవాలి
### - జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్



పుట్టపర్తి : జిల్లాలోని అన్ని చెరువులు, వంకలు, వాగుల సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఎఫ్టిఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్) మరియు బఫర్ జోన్లను సమగ్రంగా సర్వే చేసి గుర్తించాలని, అక్రమ ఆక్రమణలపై నోటీసులు జారీ చేసి వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ హాలులో, ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో వర్చువల్ గా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి వాచ్డాగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో జలవనరుల పరిరక్షణే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. చెరువులు, వాగులపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలు వరదలు, నీటి కొరతకు కారణమవుతాయని పేర్కొంటూ, చట్టపరమైన విధానాల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ధర్మవరం కొట్నూరు పరిగి ఓ .డి.చెరువు మొదలగు చెరువుల యందు ఉన్న ఆక్రమణదారుల ను వారి సామాజిక ఆర్థిక స్థితగతులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని సాగు దార్ల ఆక్రమణల తొలగింపు చేయాలి అని ఆదేశించారు. అదేవిధంగా పుట్టపర్తి చిత్రావతి నది ఆక్రమణలపై కోర్టు కేసు లను పరిశీంచాలని అన్నారు చెరువు మట్టి తవ్వకాలపై కఠినంగా వ్యవహరించాలని రైతుల పొలాలకు అనుమతి ఇరిగేషన్ వారి నుండి పొందాలని తెలిపారు. ఎఫ్టిఎల్ మరియు బఫర్ జోన్ల సరిహద్దులను స్పష్టంగా గుర్తించి మ్యాపింగ్ చేయాలని, ఆక్రమణదారులకు ముందుగా నోటీసులు సర్వ్ చేసి, సంబంధిత శాఖల సహకారంతో తొలగింపులు చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పని చేయాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు సువర్ణ, వివిఎస్ శర్మ, మహేష్, ఆనందకుమార్, మున్సిపల్ కమిషనర్ క్రాంతి, ఇరిగేషన్ శాఖ ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, ఇతర మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# పలు కార్యక్రమాలలో పాల్గొన్న శ్రీ చరణ్ రెడ్డి ..



గోరంట్ల : వానవోలు పంచాయితీ ఉగ్రరంపల్లి గ్రామ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పెద్దన్న అనారోగ్య కారణంగా ఇబ్బంది పడుతుండడంతో వారి స్వగృహానికి వెళ్లి పెద్దన్న ను పరామర్శించారు.. వడిగేపల్లి పంచాయతీలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకటరామిరెడ్డి గారి నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ సత్యసాయి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి ఉషశ్రీ చరణ్ గారి భర్త శ్రీ చరణ్ రెడ్డి గారు మరియు గోరంట్ల మండల ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

# పార్టీ కోసం కష్టపడ్డాం ! మమ్ముల్ని గుర్తించండి !
### టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ను కలిసిన
### తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి శిరిశాల రాంబాబు ఆవేదన



అనంతపురం : అనంతపురం జిల్లాలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి చాలా కష్టపడ్డాం. పార్టీ కోసం కష్టపడిన మమ్ముల్ని గుర్తించాలని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ను కలిసిన తెలుగు యువత అనంతపురం జిల్లా అధికార ప్రతినిధి శిరిశాల రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం అనంతపురం జిల్లాకు చెందిన శిరిశాల రాంబాబు మంగళగిరిలోని టిడిపి కేంద్ర పార్టీ కార్యాలయంలో తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి శిరిశాల రాంబాబు మాట్లాడుతూ 2019 నుంచి అప్పటి వైసిపి ప్రభుత్వం వారు పెట్టిన అక్రమ కేసులకు బెదరకుండా పార్టీకోసం పని చేశాము. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యానికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే కేంద్ర కార్యాలయంకు వచ్చి విన్నవించుకోవాలని మంత్రి నారా లోకేష్ చెప్పిన సూచన మేరకు ఇక్కడకు రావడం జరిగిందని అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు తెలియజేస్తూ తనకు న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేసినట్లు తెలిపారు.



## శ్రీకృష్ణదేవరాయలు జయంతిని
# రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించాలి
### అసెంబ్లీలో చర్చించిన ఎమ్మెల్యే పల్లె సింధురా
### అభినందనలు తెలిపిన కాపు, బలిజ కులస్తులు



గుత్తిత: విజయనగర సామ్రాజ్య మహారాజు శ్రీకృష్ణదేవరాయలు జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించాలని అసెంబ్లీలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధురా రెడ్డి చర్చకు తీసుకురావడం అభినందనీయమైన విషయమని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం గుత్తి మండలం గౌరవ అధ్యక్షులు, మరియు మాజీ ఎంపీటీసీ అరికిచెర్ల పులికొండ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జాతికి అపార కీర్తి తీసుకొచ్చిన మహానుభావుడు శ్రీకృష్ణ దేవరాయలు. ఆయన పాలనలో సాహిత్యం, సంస్కృతి, కళలు, పరిపాలన అన్నీ శిఖరాగ్రానికి చేరాయి. దేశభాషలందు తెలుగు లెస్స అని చాటి చెప్పిన శ్రీకృష్ణదేవరాయలు జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం ద్వారా యువతకు చరిత్ర పై అవగాహన పెంపొందించడమే కాకుండా, మన సంస్కృతికి గౌరవం చాటినట్లవుతుంది. అసెంబ్లీలో ఈ అంశాన్ని సవివరంగా ప్రస్తావించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కి మా రాష్ట్ర కాపు సోదర, సోదరీమణులు తరఫున హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ప్రతి సంవత్సరం శ్రీకృష్ణదేవరాయ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించాలని కోరుతున్నాము. ప్రజలందరూ ఈ మంచి నిర్ణయానికి మద్దతు ఇచ్చి రాష్ట్ర పండుగగా ఉమ్మడి ప్రభుత్వం ప్రకటించాలని కోరుతున్నామని తెలిపారు.

# వ్యవసాయ రంగానికి నవశకం!



తెలంగాణలో వ్యవసాయ రంగానికి నవశకం మొదలైంది. రెండేళ్లుగా రైతులకు వెన్నుదన్నుగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తోంది. గత ప్రభుత్వం వలె పంట సాయం చేసి చేతులు దులుపుకోకుండా అన్ని విధాలుగా ఆదుకొంటుంది. రుణమాఫీ మొదలుకుంటే బోనస్ వరకు.. ఫామ్ మెకనైజే షన్ నుంచి డిజిటల్ వ్యవసాయం వరకు అన్ని అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తుంది.

### రూటు మారనున్న డాలర్ డ్రీమ్స్!

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో వ్యవసాయానికి ₹1.15 లక్షల కోట్లు ఖర్చు చేసింది. 2 లక్షల రుణమాఫీ చేసి రైతులకు ఉపశమనం కల్పించింది. అలాగే 'రైతు భరోసా' కింద ఎకరాకు ₹6,000 చొప్పున రెండు సీజన్లకు పెట్టుబడి సాయం అందిస్తోంది. సన్న వడ్లకు క్వింటాలుకు ₹500 బోనస్ ప్రకటించి వరి రైతులను ప్రోత్సహిస్తోంది. అలాగే ఫామ్ మెకనైజేషన్ పథకాన్ని పునరుద్ధరించి సబ్సిడీపై యంత్రాలు అందిస్తోంది.

### ఏఐ దుష్ప్రయోగానికి కేంద్రం అడ్డుకట్ట!
### వ్యవసాయ రంగంలో టెక్నాలజీ..

వ్యవసాయ రంగానికి శాస్త్రసాంకేతికను జోడించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి ప్రయత్నిస్తుంది. ఇప్పటికే రైతులు పంటసాగులో కూలీలను తగ్గించుకోడానికి ట్రాక్టర్, హార్వెస్టర్స్, కలుపు యంత్రాలను వినియోగిస్తున్నారు.. ఇక ఫెస్టిసైడ్స్ చల్లడానికి డ్రోన్లు సైతం వాడుతున్నారు. వీటికి తోడు ప్రభుత్వం కొత్తగా డిజిటల్ అగ్రికల్చర్ విధానాన్ని కూడా తీసుకొచ్చి పైలట్ ప్రాజెక్టు కింద రాజేంద్రనగర్లోని వ్యవసాయ యూనివర్సిటీలో ఈ డిజిటల్ వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయ కూలీలు లేకుండానే ఐవోటీ సెన్సర్లు, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్ టెక్నాలజీ ద్వారా సాగు చేస్తే ప్రయత్నం చేస్తున్నారు.. దీనికోసం ప్రత్యేకంగా స్మార్ట్ అగ్రికల్చర్ ల్యాబ్ను ఏర్పాటు చేశారు. ఇక 2030-2035 వరకు మన పంట పొలాల్లో రోబోలు, డ్రోన్లు, మానవ రహిత ట్రాక్టర్లు విస్తృతంగా వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది.

### తరగని స్వరం... రేడియో!
### సాంకేతికతను వినియోగిస్తూ..

2047 వికసిత్ భారత్, తెలంగాణ రైజింగ్ లక్ష్యాల్లో వ్యవసాయం కీలక రంగంగా ఉంది. భవిష్యత్ వ్యవసాయం అంత ఏఐ ఆధారిత సాంకేతికత పైనే ఆధారపడనుంది. టెక్నాలజీ వినియోగంలో భాగంగానే యూరియా బుకింగ్ కోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ ఫర్టిలైజర్ యాప్ను తీసుకొచ్చింది. దీని ద్వారా రైతులు క్యూ లైన్లో నిలబడకుండా ఇంటివద్దనే ఉండి.. యూరియాను బుక్ చేసుకుంటున్నారు.. ఇదే తరహాలో ఫామ్ యాప్ను తీసుకొచ్చే ఆలోచనలో వ్యవసాయ శాఖ ఉంది. ఓలా, ఉబర్ టాక్సి తరహాలోనే ఈ యాప్ పనిచేయనుంది. రైతు కావాల్సిన యత్ర పరికరాలు ఈ యాప్ ద్వారా బుక్ చేసుకుంటే.. వారు వచ్చి పొలం పనులు చేసి వెళ్తారు. మరోవైపు వ్యవసాయ భూములను శాటిలైట్ సర్వే ద్వారా లెక్కిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు సాగు చేస్తున్న భూముల వివరాలు తెలుసుకోడానికి ప్రభుత్వానికి ఈ సర్వే దోహద పడనుంది.

### తెలంగాణ జాతిపిత ఎవరు?
### రైతులకు మేలు చేస్తున్న కమిషన్..

తెలంగాణ రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రైతు కమిషన్ను ఏర్పాటు చేశారు.. పంజాబ్ తర్వాత మన రాష్ట్రంలోనే వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఉంది. ఈ కమిషన్ రైతులకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తుంది. కమిషన్ ఏర్పాటైన ఏడాది కాలంలోనే క్షేత్రస్థాయి పర్యటనలు, సమీక్ష, సమావేశాలు నిర్వహించింది. అంతేకాదు ఇతర రాష్ట్రాలైన హర్యానా, కేరళ, మహారాష్ట్రలో పర్యటించి అక్కడ అమలవుతున్న విత్తన చట్టాలు, సాగు, మార్కెట్, కౌలు రైతు విధానాలపై అధ్యయనం చేసి.. ప్రభుత్వానికి సూచనలు, నివేదికలు ఇచ్చింది. ఇక ములుగు, గద్వాల్, సూర్యాపేట, కరీంనగర్ జిల్లాలో విత్తనోత్పత్తి చేసి నష్టపోయిన రైతులకు ప్రైవేట్ విత్తన కంపెనీల నుంచి నష్టపరిహారం వచ్చేలా కృషి చేసింది. ఉద్యానవన, సాంప్రదాయ పంటల సాగు పెంచేలా చర్యలు చేపడుతూ, రైతుల సంక్షేమం కోసం అహర్ని శలు కమిషన్ శ్రమిస్తుంది.

### విత్తనం రైతు హక్కు!

గత పదేళ్లుగా నకిలీ విత్తనాల కారణంగా రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నారు.. దీనికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పరిధిలో విత్తన చట్టం తీసుకురావడానికి సిద్ధమవుతోంది. ఈ చట్టం అమలైతే రైతుల విత్తన హక్కు రక్షితమవుతుంది. అదే సమయంలో సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తూ, పంటల మార్పిడి విధానాన్ని ప్రోత్సహిస్తోంది. తృణధాన్యాలు, పప్పుదినుసులు సాగు చేసే రైతులకు ఆర్థిక సాయం కూడా అందించనుంది. గత పదేండ్లలో కేంద్రమంత్రి రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సఖ్యత లేని కారణంగా రైతులకు సంక్షేమ పథకాలు రాకుండా పోయాయి.. కానీ ప్రస్తుత వచ్చే నిధులు, సంక్షేమ పథకాల అమలు విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ఎప్పటికప్పుడూ అధికా రులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి పనిచేయిస్తుంది. ఇన్నోవేటివ్ ఆలోచనలకూ సైతం పెద్ద పీట వేస్తుంది. ఇక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికే కాదు వ్యవసాయ విద్యకు సైతం ప్రాధాన్యత ఇస్తుంది. ప్రతి జిల్లాకో అగ్రి కల్చర్ కాలేజీని ఏర్పాటు చేసి వ్యవసాయ విద్యను అభ్యసించే విద్యార్థులను ప్రోత్సహిస్తుంది.

# రూ.3.38 లక్షల కోట్ల నుంచి రూ.3.48 లక్షల కోట్లు

రాష్ట్రం పునరుద్ధరణ నుంచి ప్రగతి వైపు అడుగులు వేస్తున్నప్పటికీ ఆర్థికంగా ఇంకా సుస్థిరం కావాల్సి ఉంది. పాత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక సంక్షోభాల నుంచి బయటపడి ఊపిరి పీల్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న సమయంలోనే ప్రభుత్వం మూడో బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది. రేపు ప్రశ్నోత్తరాలు, శూన్య గంట ముగిశాక ఉదయం 11 గంటలకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 2026-27 వార్షిక బడ్జెట్ను శాసనసభకు సమర్పించనున్నారు. బడ్జెట్ రూ.3.38 లక్షల కోట్ల నుంచి రూ.3.48 లక్షల కోట్ల మధ్య ఉండనున్నట్లు సమాచారం. అసెంబ్లీలో రేపు ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్ కసరత్తు కొలిక్కి వచ్చింది. ఆర్థికశాఖ అధికారులు దీనికి తుదిరూపు ఇచ్చే పనిలో ఉన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రేపు సమర్పించబోయే బడ్జెట్ స్వరూపం ఇంతకు ముందుతో పోలిస్తే పెద్దగా మారే అవకాశాలు కనిపించడం లేదు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.3,22,359.33 కోట్ల అంచనాలతో రాష్ట్ర బడ్జెట్ ను సమర్పించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఇది రూ.3.35 లక్షల కోట్ల నుంచి రూ.3.48 లక్షల కోట్ల మధ్య ఉండొచ్చని అంచనాలు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3,22,350 కోట్లకు బడ్జెట్ సమర్పించినా ఇంతవరకు ఖర్చు రూ.2.40 లక్షల కోట్ల వరకే ఉందని ఆర్థికశాఖ వర్గాల అంచనా. జనవరి నెలాఖరు వరకు ఏపీ రెవెన్యూ రాబడి లక్షా 40 వేల 540 కోట్లుగా ఉందని ఆర్థికశాఖ అధికారులు అధికారికంగా వెల్లడించారు. ఇందుకుగానూ బహిరంగ మార్కెట్ రుణాలు కలిపి ప్రస్తుతం ఖర్చులు కొలిక్కి వస్తాయి. కిందటి ఆర్థిక సంవత్సరం తరహాలోనే: 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద ఖర్చు సవరించిన అంచనాల ప్రకారం 2 లక్షల 40 వేల 500 కోట్లుగా బడ్జెట్ లెక్కలు పేర్కొంటున్నాయి. రేపటి బడ్జెట్లో అసలు వాస్తవంగా ఎంత ఖర్చు పెట్టారనే లెక్కలు తేలతాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కిందటి ఆర్థిక సంవత్సరం తరహాలోనే ఉంది. రాబడులు 10 శాతం మించి పెరిగే అవకాశాలు కనిపించడం లేదు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి అంచనాల ఆధారంగా బహిరంగ మార్కెట్ రుణాలకు మరికొంత అస్కారం ఉండొచ్చు. సంక్షేమ పథకాలు, ఇతర అభివృద్ధి పథకాలు దాదాపు పాత ఆర్థిక సంవత్సరం తరహాలోనే కొనసాగే ఆస్కారం కనిపిస్తోంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు చూస్తే కిందటి ఆర్థిక సంవత్సరం బడ్జెట్ స్వరూపంతో పోలిస్తే 5 నుంచి 10 శాతం మధ్య పెరుగుదలకు అస్కారం ఉంటుందనేది అంచనా.

## ప్రజలకు సమాచారం చేరవేయడంలో

# అడ్డంకులు సృష్టించడం సరైంది కాదు...

కౌంటింగ్ కేంద్రం వద్ద మీడియా ప్రతినిధులను అడ్డుకున్న అధికారుల తీరుపై ఆగ్రహం...



గోదావరిఖని//ఫిబ్రవరి13(ఆకాంక్ష) : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు సందర్భంగా గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కౌంటింగ్ కేంద్రం వద్ద మీడియా ప్రతినిధులను అడ్డుకున్న అధికారుల తీరుపై జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు.కవరేజీ కోసం వచ్చిన మీడియా ప్రతినిధులను అధికారులు లోపలికి అనుమతించక పోవడంతో పాత్రికేయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్నికల ఫలితాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయడం మీడియా బాధ్యత అని పేర్కొన్న జర్నలిస్టులు, తమను అడ్డుకోవడం వెనుక కారణం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. సరైన అనుమతులు ఉన్నప్పటికీ లోపలికి అనుమతి ఇవ్వకపోవడం ఏకపక్ష నిర్ణయమని ఆరోపించారు.ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వెలుపలే మీడియా ప్రతినిధులు నిరసన చేపట్టారు. అధికారుల తీరుపై వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడ భద్రతా సిబ్బంది అదనంగా మోహరించారు.అధికారుల చర్యలతో కౌంటింగ్ కేంద్రం వద్ద కొంతసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. తర్వాత ఉన్నతాధికారులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అయితే పాత్రికేయులు తమకు అనుమతి ఇవ్వాలని పట్టుబడుతూనే ఉన్నారు.రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల లెక్కింపు కొనసాగుతుండగా, మీడియా ప్రతినిధులను అడ్డుకోవడంపై జోరుగా చర్చ సాగుతోంది. ప్రజలకు సమాచారం చేరవేయడంలో అడ్డంకులు సృష్టించడం సరైంది కాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనతో గోదావరిఖని కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, పోలీసులు అప్రమత్తంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

## దేశవ్యాప్తంగా ఎం ఎస్ పి కి చట్టబద్ధత కల్పించాలి....

సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు జల్దీర్ సింగ్ జలేవాలే...



వెల్దుర్తి//ఫిబ్రవరి13(ఆకాంక్ష) : దేశంలోని రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర (ఎంఎస్పి) కల్పించి, దానికి చట్టబద్ధత ఇవ్వాలని సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులు జల్దీర్ సింగ్ జలేవాలే డిమాండ్ చేశారు. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు నిర్వహిస్తున్న జాగృతి యాత్రలో భాగంగా ఆయన కర్నూలుకు విచ్చేశారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏఐకెఎస్) ఆధ్వర్యంలో కర్నూలు ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.రైతుల హక్కుల కోసం ఢిల్లీలో దాదాపు 132 రోజుల పాటు నిరాహార దీక్ష నిర్వహించిన యోధుడిగా జల్దీర్ సింగ్ జలేవాలే ప్రసిద్ధి పొందారు. రైతులకు కనీస మద్దతు ధర చట్టబద్ధంగా అమలు చేయడం, అప్పుల మాఫీ, వ్యవసాయ ఖర్చులను తగ్గించే విధానాలు చేపట్టడం వంటి అంశాలపై కేంద్రం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన అన్నారు.ఈ సమావేశంలో కోడుమూరు, వెల్దుర్తి ప్రాంతాల సిపిఐ మండల నాయకులు బి.రాజు, టి.కృష్ణ, డి.రాజు తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. రైతు ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని నాయకులు నిర్ణయించారు.

## క్షయ వ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలి



నాగర్‌కర్నూల్//ఫిబ్రవరి13(ఆకాంక్ష) : క్షయ వ్యాధి పట్ల ప్రజలు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. రవికుమార్ పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం పరిధిలోని చిన్నముద్దునూరు గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని ఆయన సందర్శించి రోగులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు పైబడి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయ్యిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తోందని,కాబట్టి భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవడానికి పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.భవిష్య భారత్ ఆధ్వర్యంలో, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో తెలకపల్లి




ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్నముద్దునూరు ఆరోగ్య ఉప కేంద్రంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ రుక్సానా బేగం ప్రారంభించారు.ఈ శిబిరంలో అనుమానిత క్షయ రోగులైన మధుమేహ వ్యాధిగ్రస్తులు,ధూమపానం మరియు మద్యపానం చేసే వ్యక్తులు, తక్కువ బరువు కలిగిన వారు, క్షయ చికిత్స పొందుతున్న కుటుంబ సభ్యులు, గతంలో క్షయ వ్యాధి చికిత్స తీసుకున్నవారిని ప్రత్యేకంగా గుర్తించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 145 మందికి ఎక్స్-రే, రక్త పరీక్షలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ సయ్యద్ సజ్జత్ అలీ, ఎం.ఎం.యు ఎండీ ఖలీల్, ఎక్స్-రే టెక్నీషియన్లు ఆమన్, చందు, వీరేష్, హెల్త్ సూపర్వైజర్ వీరుపాల్, ఎస్.టి.ఎల్.ఎస్ శ్రవణ్ కుమార్, ఎం.ఎల్.హెచ్.పీ కల్పన, హెల్త్ అసిస్టెంట్ బాలస్వామి, ఏఎన్ఎం అరుణ, ఆశా కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.ప్రభుత్వం చేపడుతున్న క్షయ నిర్మూలన కార్యక్రమాలను ప్రజలు వినియోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యాధికారి ఈ సందర్భంగా కోరారు.

## ఎంపీపీఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన సర్పంచ్, ఉప సర్పంచ్...



కొత్తగూడెం//ఫిబ్రవరి13(ఆకాంక్ష) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని బూర్గంపాడు మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు సర్పంచ్ మందా నాగరాజు, ఉప సర్పంచ్ గుండే వెంకన్న స్వయంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, శుభ్రత,వంటశాల పరిస్థితులు తాగునీటి సౌకర్యాలను పరిశీలిస్తూ పిల్లల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మందా నాగరాజు మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు పాఠశాల సిబ్బందిపై ఉందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆహార పట్టిక ప్రకారం ప్రతిరోజూ మెనూ మారుస్తూ పోషకాహారం అందించాలని, పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వంటకాలను శుభ్రంగా తయారు చేయాలని సూచించారు. భోజనం నాణ్యతపై ఎటువంటి రాజీ పడకూడదని హెచ్చరించారు. ఉప సర్పంచ్ గుండే వెంకన్న మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం విద్యార్థుల హాజరు పెంపుదలతో పాటు వారి ఆరోగ్యాభివృద్ధికి ఎంతో దోహద పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు అందించే అన్నం,కూరగాయలు, గుడ్లు వంటి ఆహార పదార్థాలు సరైన పరిమాణంలో ఉండేలా పర్యవేక్షణ చేయాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. తదనంతరం తాగునీటి సదుపాయాలను పరిశీలించిన ప్రజాప్రతినిధులు, వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్ర పరచాలని ఎప్పటికప్పుడు శుద్ధి చేసిన తాగునీటిని అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పాఠశాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, తరగతి గదులు, వంటశాల, భోజనశాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. శేషగిరి, గ్రామ పంచాయతీ సిబ్బంది అనిల్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం పాఠశాలలో చేపడుతున్న చర్యలను ప్రజాప్రతినిధులు అభినందించారు. గ్రామ స్థాయిలో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ఇలాంటి తనిఖీలు తరచుగా నిర్వహిస్తామని సర్పంచ్ పేర్కొన్నారు.

## డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ పీఠం కాంగ్రెస్ కైవసం...




కొత్తగూడెం//ఫిబ్రవరి13(ఆకాంక్ష) : డోర్నకల్ మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికల ఫలితాలు శుక్రవారం వెల్లడికాగా మొత్తం 15 వార్డుల్లో 11 వార్డులను గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యంతో చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. బిఆర్ఎస్ పార్టీ 4 వార్డుల్లో విజయం సాధించగా, మిగిలిన వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యాన్ని చాటింది. ఈ ఫలితాలతో డోర్నకల్ పట్టణ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని బలం లభించినట్లు స్పష్టమైంది.మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన అభ్యర్థులు వరుసగా 1వ వార్డులో మాదా లావణ్య, 2వ వార్డులో భూక్యా ప్రమీల, 3వ వార్డులో బాధవత్ వీరన్న, 5వ వార్డులో బాధవత్ హేమలత, 6వ వార్డులో రాజకుమారి, 7వ వార్డులో తేజావత్ నవీన్, 10వ వార్డులో మల్లం ప్రవీణ, 11వ వార్డులో బొబ్బల సంధ్య, 12వ వార్డులో బడేటి రామ కోటేష్, 13వ వార్డులో ఎల్లావుల సువర్ణ, 15వ వార్డులో గారే రమేష్ విజయం సాధించారు.ఇక బిఆర్ఎస్ పార్టీ తరఫున 4వ వార్డులో ధరవత్ రమేష్, 8వ వార్డులో గుగులోత్ రాము, 9వ వార్డులో బోరగల్ల శరత్, 14వ వార్డులో అంగోత్ శైలజ విజయం సాధించారు.మొత్తం ఫలితాలను పరిశీలిస్తే, డోర్నకల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రావడంతో చైర్మన్ పీఠం కాంగ్రెస్ కైవసం కావడం ఖాయమైంది.ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే కాంగ్రెస్ శ్రేణులు ఆనందోత్సాహాలతో సంబరాలు నిర్వహించగా, పట్టణ వ్యాప్తంగా విజయోత్సాహం కనిపించింది.ఈ ఎన్నికల ఫలితాలు స్థానిక రాజకీయ సమీకరణాలపై కీలక ప్రభావం చూపనున్నాయి. కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. డోర్నకల్ ప్రజల అభివృద్ధి కోసం సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగవంతం చేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు

## జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా ఆంగ్లభాష దినోత్సవ వేడుకలు..




నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి13(ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల పరిధిలోని జిల్లా పరిషత్ హై స్కూల్ మంగనూరులో సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా ఆంగ్లభాష దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల సందడి మధ్య నిర్వహించిన ఈ వేడుకలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్స్, ఉపన్యాసాలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి హాజరైన వారిని అలరించాయి. ఆంగ్లభాష ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా విద్యార్థులు వివిధ అంశాలపై మాట్లాడి తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ఆంగ్లభాష ప్రాధాన్యత ఎంతగానో పెరిగిందని, భవిష్యత్తులో ఉన్నత విద్య మరియు ఉద్యోగ అవకాశాల కోసం ఆంగ్లభాషలో పట్టు సాధించడం అత్యంత అవసరమని అన్నారు. విద్యార్థులు రోజువారీ జీవితంలో ఆంగ్లభాషను వినియోగించే అలవాటు పెంచుకోవాలని సూచించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంగనూరు పాఠశాల పూర్వ విద్యార్థి అడ్వకేట్ వెంకటేశ్వర్లు, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ అధ్యక్షుడు అడ్వకేట్ అనంత రెడ్డి, పద్మా రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్వకేట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంగనూరులోని విద్యార్థులకు ఆంగ్లభాషలో నైపుణ్యం పెంపొందించేందుకు వేసవి కాలంలో 45 రోజుల పాటు స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ శిబిరాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తానని ప్రకటించారు. ఈ ప్రకటనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులు శ్రీ వాణి అనంతరామ శర్మతో పాటు సీనియర్ ఉపాధ్యాయులు సువర్ణ, తిరుపతయ్య, సుదర్శన్ వెంకటేష్, యాదగిరి, అలివేలమ్మ, అరుణమ్మ, వెంకన్న గౌడ్, ఆసియా మేడం, పవన్ శర్మ, శ్రీమతి విజయలక్ష్మి, స్వప్న, వరలక్ష్మి, లక్ష్మణ్ తదితరులు పాల్గొని పాఠశాలలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలను విజయవంతం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథుల సమక్షంలో ఈ వేడుకలు ఘనంగా ముగిశాయి.

## ఘనంగా విద్యార్థులతో స్వయం పరిపాలన దినోత్సవం...



నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి13(ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండల పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులచే స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ ఉన్నతాధికారుల పాత్రలను స్వీకరించి ఒక రోజు పరిపాలనను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌గా ఎండి సోహెల్, ఆర్జేడిగా దీప్తి, అడిషనల్ కలెక్టర్‌గా ఎన్. జ్యోతి, డీఈఓగా గీత, ఎంఈఓగా శ్రేయ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా తులసి బాధ్యతలు చేపట్టారు. మొత్తం 28 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా, 8 మంది సిబ్బందిగా వ్యవహరించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల మాదిరిగా సన్నద్ధమై తరగతి గదుల్లో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగించి పాఠ్యాంశాలను సమగ్రంగా బోధించారు. ఇతర విద్యార్థులు శ్రద్ధగా పాఠాలు విన్నారు.విద్యార్థి ఉపాధ్యాయుల బోధనను ఉపాధ్యాయులు స్వయంగా పరిశీలించారు. ఒక రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించడం ద్వారా విద్యార్థులకు ఉపాధ్యాయుల



బాధ్యతలు అవగాహన అవుతాయని, భవిష్యత్తులో ఉపాధ్యాయ వృత్తి పట్ల ఆసక్తి పెంపొందుతుందని పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జీ. మురళీ మోహన్ చార్యులు తెలిపారు. చక్కగా బోధించిన విద్యార్థులను అభినందిస్తూ బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు హనుమంతు రెడ్డి, యాదగిరి రావు, చంద్రమోహన్ రెడ్డి, పరమేశ్వరయ్య, నూరుద్దీన్, కృష్ణకుమార్,వెంకటస్వామి, హుస్సేన్, నాగిరెడ్డి, సతీష్ రెడ్డి, శేఖర్, భవిత, జయలక్ష్మి, లక్ష్మీపతి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జనగామలో కాంగ్రెస్ అరాచకాలకు తెరలేపిన ఘటన...

ఇండిపెండెంట్ అభ్యర్థిని కిడ్నాప్ చేయడానికి ప్రయత్నం...

బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపిన పర్వతాలపై దాడి యత్నం...

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి జోక్యంతో ఉద్రిక్తత...

జనగామ//ఫిబ్రవరి13(ఆకాంక్ష) : జనగామ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. అధికార పార్టీ కాంగ్రెస్‌కు చెందిన నాయకులు,అనుచరులు అరాచకాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తాజాగా ఇండిపెండెంట్ అభ్యర్థిని కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే, మున్సిపల్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన భూష పర్వతాలు బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ప్రకటించారు. దీంతో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ నేతలు, తమకు అనుకూలంగా పరిస్థితులను మార్చుకునేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు వస్తున్నాయి.బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించిన పర్వతాలను క్యాంపుకు తరలిస్తుండగా, భువనగిరి వద్ద కాంగ్రెస్ నేతలు అడ్డుకుని వాహనాన్ని నిలిపివేసి, పర్వతాలను బలవంతంగా తమ వెంట తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అనుచరులు కీలక పాత్ర పోషించినట్లు బీఆర్ఎస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. పర్వతాలను వాహనం నుండి లాక్కెళ్లేందుకు చేసిన ప్రయత్నం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సమాచారం అందుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాంగ్రెస్ నాయకుల చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా జరిగే ఇలాంటి చర్యలను అడ్డుకోవాలని ఆయన పోలీసులను కోరారు. ఈ సందర్భంగా అక్కడ స్వల్ప తోపులాటలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.మరోవైపు ఈ ఘటనపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీకి మద్దతు తెలిపిన అభ్యర్థిని కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చే చర్య అని విమర్శించారు. ఎన్నికల సమయంలో భయభ్రాంతులకు గురిచేసి లాభపడాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.ఇక కాంగ్రెస్ వర్గాలు మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తున్నాయి. తమ పార్టీపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వారు అంటున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు సమాచారం. జనగామలో జరిగిన ఈ ఘటనతో మున్సిపల్ ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది. రాజకీయ పార్టీల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతుండటంతో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. ఎన్నికల ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## కాకతీయ యూనివర్సిటీలో పదోన్నతుల పర్వం...

బోధన, పరిశోధనలో ప్రతిష్ట పెంపుదలపై వైస్ ఛాన్సలర్ పిలుపు...




హన్మకొండ//ఫిబ్రవరి13(ఆకాంక్ష) : హన్మకొండలోని కాకతీయ యూనివర్సిటీలో బోధనతో పాటు సమగ్ర పరిశోధన కార్యక్రమాలను మరింత బలోపేతం చేసి విశ్వవిద్యాలయ ప్రతిష్టను దేశ వ్యాప్తంగా పెంపొందించాలని వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. బోధనా సిబ్బందికి నిర్వహించిన కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సిఏఎస్) నవంబర్ నెల ఫలితాలను విడుదల చేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం సమక్షంలో పదోన్నతి ఉత్తర్వులను వైస్ ఛాన్సలర్ అందజేశారు. విశ్వవిద్యాలయంలో ప్రతిభ కనబరిచిన అధ్యాపకులను గుర్తిస్తూ మొత్తం పలువురికి వివిధ హోదాల్లో పదోన్నతులు మంజూరు చేసినట్లు అధికారులు వెల్లడించారు. వివరాల ప్రకారం ఇద్దరు ఆచార్యులకు సీనియర్ ప్రొఫెసర్ హోదా, తొమ్మిది మంది సహ ఆచార్యులకు ఆచార్యులుగా, 29 మంది సహాయ ఆచార్యులకు సహ ఆచార్యులుగా పదోన్నతులు లభించాయి. అదనంగా ముగ్గురు సహాయ ఆచార్యులకు సెలక్షన్ గ్రేడ్ సహ ఆచార్యులుగా,ఇద్దరు సహాయ ఆచార్యులకు సీనియర్ స్కేల్ పదోన్నతులు మంజూరు చేయడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడిన వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి, నాణ్యమైన బోధనతో పాటు సమగ్ర పరిశోధన, అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం అకాడెమిక్ కార్యక్రమాలను కొనసాగించడం ద్వారా విశ్వవిద్యాలయాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని అధ్యాపకులకు సూచించారు. విద్యార్థుల అభివృద్ధి, పరిశోధనలో నూతన ఆవిష్కరణలు, సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులు చేపట్టాలని ఆయన ప్రోత్సహించారు. కార్యక్రమంలో అకుట్ బాధ్యులు ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, ఉప రిజిస్ట్రార్ పంజాల శ్రీధర్‌తో పాటు ఇతర అకుట్ అధికారులు, పరిపాలన విభాగాధికారులు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు. విశ్వవిద్యాలయంలో పదోన్నతులు పొందిన అధ్యాపకులకు సహచరులు అభినందనలు తెలిపారు.

## భోపాల్‌లో విద్యార్థినిపై సామూహిక అత్యాచారం....

వీడియోతో బెదిరించి డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్....

భోపాల్//ఫిబ్రవరి13(ఆకాంక్ష) : మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్లో ఘోర సంఘటన వెలుగుచూసింది. 11వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిపై నలుగురు కార్లలో తీసుకెళ్లి పలుమార్లు సామూహిక అత్యాచారానికి పాల్పడిన దారుణం కలకలం రేపింది. బాధితురాలిని వీడియో చిత్రీకరించి బెదిరింపులకు గురిచేస్తూ డబ్బులు డిమాండ్ చేసిన ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, బాధితురాలికి పరిచయం ఉన్న ఇద్దరు యువకులు ఆమెను మోసం చేసి తమతో తీసుకెళ్లారు. అనంతరం నాలుగు కార్లలో తిరుగుతూ పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దారుణాన్ని వారిలో ఒకరు ఐఫోన్‌లో వీడియోగా చిత్రీకరించారు. ఆ వీడియోను బాధితురాలికే పంపించి రూ.40,000 ఇవ్వాలని, లేదంటే సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తామని బెదిరించారు. భయాందోళనకు గురైన బాలిక చివరకు పోలీసులను ఆశ్రయించింది. ఫిర్యాదు ఆధారంగా ప్రధాన నిందితుడు ఆసఫ్ అలీ ఖాన్, అతని అనుచరుడు మేజ్ ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో ఉపయోగించిన థార్ ఎస్‌యూవీతో సహా నాలుగు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అయితే వీడియో చిత్రీకరణకు ఉపయోగించిన ఐఫోన్‌ను స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మేజ్ ఖాన్‌తో సంబంధాలున్న ఓ హెడ్ కానిస్టేబుల్ కీలక సమాచారం లీక్ చేసినట్లు గుర్తించి అతడిని సస్పెండ్ చేసినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు.ఈ ఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతుండగా, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పోలీసులు కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## నల్లగొండ జిల్లా కౌంటింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత...

ధ్రువీకరణ పత్రంపై వివాదం...

బీఆర్ఎస్ నిరసనలతో లాఠీచార్జ్...



నల్లగొండ/ఫిబ్రవరి13(ఆకాంక్ష) : నల్లగొండ పట్టణంలోని కౌంటింగ్ కేంద్రం వద్ద శుక్రవారం తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. 14వ వార్డు ఫలితాల విషయంలో తలెత్తిన వివాదం కారణంగా బీఆర్ఎస్ మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కేంద్రం వద్ద గందరగోళానికి దారితీశారు.14వ వార్డు కౌంటింగ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందినప్పటికీ, అధికారుల నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గెలిచినట్లు ధ్రువీకరణ పత్రం జారీ చేయబడిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. దీనిపై తీవ్రంగా ఆగ్రహించిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి కౌంటింగ్ కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని అధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు.ఇదే సమయంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. పోలీసుల చర్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కేంద్రం ఎదుట రోడ్డుపై బైఠాయించారు.పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు నిరసన కారులను చెదరగొట్టేందుకు లాఠీచార్జ్‌కు దిగారు. ఈ ఘటనలో కొంతమంది కార్యకర్తలు గాయపడినట్లు సమాచారం. వెంటనే అదనపు పోలీసు బలగాలను రంగంలోకి దింపి కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ సంఘటనతో నల్లగొండ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఎన్నికల ఫలితాలపై స్పష్టత కోసం అధికారులు మళ్లీ లెక్కింపు చేపట్టాలన్న డిమాండ్ బీఆర్ఎస్ నేతల నుంచి వినిపిస్తోంది. మరోవైపు అధికారుల నుంచి వచ్చిన ధ్రువీకరణ పత్రం సరైనదేనని కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నారు. ఉద్రిక్త పరిస్థితుల మధ్య కౌంటింగ్ ప్రక్రియను కొనసాగించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్రం పరిసరాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

## చేర్యాలలో సస్పెండ్ చేసిన కానిస్టేబుల్ భార్య ఘన విజయం...



సిద్దిపేట//ఫిబ్రవరి13(ఆకాంక్ష) : సిద్దిపేట జిల్లా చేర్యాల మున్సిపాలిటీ రాజకీయాలలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మున్సిపాలిటీ 2వ వార్డు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గీతాంజలి ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై 223 ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ఈ ఎన్నికల్లో మొదటి నుంచీ పోటీ ఉత్కంఠభరితంగా కొనసాగింది. అధికార కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థిని బలంగా నిలబెట్టగా,బీఆర్ఎస్ పార్టీ కూడా సమర్థంగా ప్రచారం నిర్వహించింది. గీతాంజలి అభ్యర్థిత్వం ప్రకటించిన నాటి నుంచే ఎన్నికల సమరం హీట్ ఎక్కింది.గీతాంజలి భర్త పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా పని చేస్తుండగా, ఆమె బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తుండటంతో ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు సమాచారం. ఈ చర్యపై అప్పట్లో రాజకీయ వర్గాల్లో చర్చలు చెలరేగాయి. ప్రభుత్వ చర్యపై బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా విమర్శలు గుప్పించారు. ఈ పరిణామం ఎన్నికల ప్రచారంలో ప్రధాన అంశంగా మారింది. గీతాంజలి తన ప్రచారంలో ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ఇంటింటికీ తిరిగారు. నీటి సమస్యలు, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి స్థానిక సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు.ప్రజలతో నేరుగా మమేకమై సాగిన ప్రచారం గీతాంజలికి మంచి ఫలితాలను ఇచ్చింది. వార్డు ప్రజలు ఆమెకు విశేషంగా మద్దతు ప్రకటించారు. ఎన్నికల రోజు కూడా ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించారు.ఈరోజు వెలువడిన ఫలితాల్లో గీతాంజలి 223 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించారు. ఫలితాలు వెలువడగానే బీఆర్ఎస్ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. పటాకులు పేల్చి, మిఠాయిలు పంచుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ విజయంతో బీఆర్ఎస్ పార్టీ స్థానిక స్థాయిలో తమ బలం చాటుకున్నట్టు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీకి ఈ ఫలితం కొంత నిరాశ కలిగించినట్టు తెలుస్తోంది. గీతాంజలి విజయం వెనుక ప్రజల మద్దతు ప్రధాన కారణమని స్థానిక నాయకులు పేర్కొన్నారు. తాను గెలిచిన తర్వాత ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తానని గీతాంజలి తెలిపారు. తనపై నమ్మకం ఉంచిన ప్రతి ఓటరికి కృతజ్ఞతలు తెలిపారు.చేర్యాల మున్సిపాలిటీ 2వ వార్డు ఎన్నికల ఫలితం జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. భవిష్యత్‌లో స్థానిక రాజకీయాలపై ఈ ఫలితం ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.మొత్తానికి, సస్పెండ్ అయిన కానిస్టేబుల్ భార్య గీతాంజలి సాధించిన ఈ ఘన విజయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజల తీర్పు ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంటుందని ఈ ఫలితం మరోసారి నిరూపించింది.

# రక్త సంబంధం కాదు వృత్తి బంధం.!

గాయపడిన జాఫర్‌కు.. మెకానికుల సాయం మానవీయ చేయూత...



గోదావరిఖని టౌన్//ఫిబ్రవరి 13 **ఆకాంక్ష :** రామగుండం కార్పొరేషన్ లోని గోదావరిఖని లో మానవత్వానికి మరో చిరస్మరణీయ ఉదాహరణగా టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నిలిచారు.జనవరి 15న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంఘం ఉపాధ్యక్షుడు ఎండి.జాఫర్ కుటుంబానికి ఆర్థిక అండగా నిలిచారు.ఈ సందర్భంగా శుక్రవారం జాఫర్ నివాసానికి వెళ్లిన తోటి మెకానికులు,గొప్ప మనసుతో,మానవతా దృక్పథంతో రూపాయలు 30,000 నగదుతో పాటు 5,000 విలువైన నిత్యావసర సరుకులు అందజేశారు.చికిత్స ఖర్చులు,కుటుంబ పోషణకు ఈ సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని జాఫర్ కుటుంబ సభ్యులు భావోద్వేగంతో తెలిపారు. కష్టకాలంలో తోడుగా నిలవడమే నిజమైన స్నేహమని,సంఘీభావం అంటే ఏమిటో ఈ సాయం మరోసారి చాటిచెప్పిందని స్థానికులు ప్రశంసించారు. ప్రమాదం జీవితాన్ని కుదిపేసినా,తోటి మెకానికుల మానవీయత జాఫర్ కుటుంబానికి కొత్త ఆశను నింపింది. కష్టం వచ్చినప్పుడు వెన్నుదన్నుగా నిలిచిన మెకానికుల ఐక్యతకు సెల్యూట్..! ఈ కార్యక్రమంలో టిజిపిఏ తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు దార మధు,యూనియన్ అధ్యక్షులు రెడ్డి రాజ్ కుమార్,ప్రధాన కార్యదర్శి మాతంగి శివరాజ్, సంయుక్త కార్యదర్శి ఆరెపల్లి కుమారస్వామి, గౌరవ సలహాదారులు గణేష్, సత్యం,సమ్మిరెడ్డి, కోశాధికారి సంజీవరెడ్డి,కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు,సభ్యులు చింతం స్వామి,భాస్కర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క ఓటుతో వరించిన విజయం కల్వకుర్తి....

పరకాల మున్సిపాలిటీల్లో ఆసక్తికర ఫలితాలు...



పరకాల//ఫిబ్రవరి 13 **ఆకాంక్ష :** మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ఉత్కంఠభరిత దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. ఒక్క ఓటు అభ్యర్థుల తలరాతను మార్చేసి రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. కల్వకుర్తి, పరకాల మున్సిపాలిటీలలో రెండు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు ఒక్క ఓటు తేడాతో విజయం సాధించడం ఆసక్తికరంగా మారింది. ఓటర్ల తీర్పు ఎంత కీలకమో ఈ ఫలితాలు మరోసారి స్పష్టం చేశాయి.కల్వకుర్తి మున్సిపాలిటీలోని 10వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ఎజాస్, బీఆర్ఎస్ అభ్యర్థి తాహిర్ మధ్య గట్టి పోటీ నెలకొంది. మొదటి లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి ఎజాస్‌కు రెండు ఓట్ల ఆధిక్యం వచ్చినట్లు ప్రకటించగా, బీఆర్ఎస్ అభ్యర్థి తాహిర్ రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేశారు. దీంతో ఎన్నికల అధికారులు మరోసారి ఓట్ల లెక్కింపు నిర్వహించారు. రెండోసారి లెక్కించినప్పటికీ ఫలితంలో మార్పులేకుండా కాంగ్రెస్ అభ్యర్థి ఎజాస్‌కు 259 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి తాహిర్‌కు 258 ఓట్లు వచ్చినట్లు తేలింది. దీంతో ఒక్క ఓటు తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి ఎజాస్ విజయం సాధించినట్లు అధికారులు అధికారికంగా ప్రకటించారు.అదేవిధంగా పరకాల మున్సిపాలిటీలోని 17వ వార్డులో కూడా ఇదే తరహా ఉత్కంఠ కొనసాగింది. కాంగ్రెస్ అభ్యర్థి బొచ్చు సుభద్రకు 369 ఓట్లు పోలవగా బీఆర్ఎస్ అభ్యర్థి శనిగరపు రజినికి 368 ఓట్లు వచ్చాయి. ఒక్క ఓటు తేడాతో వెనుకబడిన బీఆర్ఎస్ అభ్యర్థి రజిని రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేయగా, రెండోసారి నిర్వహించిన లెక్కింపులో కూడా అదే ఫలితాలు వెలువడ్డాయి. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి బొచ్చు సుభద్ర విజయం సాధించినట్లు అధికారులు ప్రకటించారు.ఈ రెండు చోట్ల ఒక్క ఓటుతో కాంగ్రెస్ అభ్యర్థులు గెలవడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఓటర్ల తీర్పు ఎంత సున్నితంగా నిర్ణాయకంగా ఉంటుందో ఈ ఫలితాలు స్పష్టంగా చూపించాయి. ఎన్నికల సమయంలో ప్రతి ఓటు ఎంత విలువైనదో ఈ సంఘటనలు మరోసారి గుర్తు చేస్తున్నాయి.

# కాంగ్రెస్ అభ్యర్థి రాజేశ్వరి గెలుపు పై హర్షం....



నాగర్‌కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 13 **ఆకాంక్ష :** నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ 17వ వార్డు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజేశ్వరి 83 ఓట్ల మెజారిటీతో విజయం సాధించడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. గెలుపుకు కృషి చేసిన వార్డు ఇంచార్జిలుగా బిజినేపల్లి మాజీ సింగిల్ విండో చైర్మన్ మలిశెట్టి వెంకటస్వామి, మాజీ సర్పంచ్ అమృత్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.డి. ముఖ్తార్, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ ఎం.డి. నజీర్, సీనియర్ నాయకులు ముద్దం మధుసూదన్ రెడ్డి, మొల్గర మహేందర్, మండల మైనారిటీ నాయకులు ఎం.డి. అజీమ్, వెల్గొండ మల్లేష్, బోయపూర్ సైదులు, లట్టుపల్లి తిరుపతిరెడ్డి, కార్కొండ నరేందర్, వెలుగొండ నగేష్ రెడ్డి, బాలరాజు, గుడ్లనర్వ సర్పంచ్ లెట్ల బాలస్వామి తదితరులు రాజేశ్వరి గెలుపుపై ఆనందం వ్యక్తం చేశారు.

# కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఫేర్‌వెల్ పార్టీ....

సరోజినీ నాయుడు జయంతి వేడుకలు...




జడ్చర్ల//ఫిబ్రవరి 13 **ఆకాంక్ష :** మిడ్జిల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం ఫేర్‌వెల్ పార్టీతో పాటు సరోజినీ నాయుడు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కలిసి ఆమెకు ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అల్వాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎడ్ల శంకర్ హాజరై మాట్లాడుతూ సరోజినీ నాయుడు గారి సేవలను కొనియాడారు. భారత కోకిల'గా ప్రసిద్ధి చెందిన ఆమె గొప్ప కవయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలు మాత్రమే కాకుండా భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా, గవర్నర్‌గా సేవలు అందించిన తొలి భారతీయ మహిళగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.ఫిబ్రవరి 13న జరుపుకునే జాతీయ మహిళా దినోత్సవం స్త్రీ శక్తికి ప్రతీకగా నిలిచిందని, మహిళల హక్కులు, విద్య, సాధికారత కోసం సరోజినీ నాయుడు చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి దాయకమని అన్నారు. "నిజంగా భారతీయులైన వారందరికీ రాజకీయాలలో ఆసక్తి అనివార్యం" అన్న ఆమె సందేశం ఇప్పటికీ సమాజాన్ని ప్రేరేపిస్తోందని పేర్కొన్నారు.ఈ వేడుకల సందర్భంగా విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, సరోజినీ నాయుడు జీవిత విశేషాలను ప్రదర్శించారు. అనంతరం పాఠశాల విద్యార్థినులకు ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని నిర్వహించి, భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మమత మన్యం, ఎంఆర్‌ఓ స్వప్న, మాజీ సర్పంచ్ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ గౌస్, ఎస్.ఓ కవిత, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా సాగడంతో గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

## జడ్చర్లలో సేవాలాల్ మహారాజ్ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం...

యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పిలుపు...



జడ్చర్ల//ఫిబ్రవరి 13 **ఆకాంక్ష :** సద్గురు సంత శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాల సందర్భంగా రాజాపూర్ మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి క్రీడాకారులతో సాన్నిహిత్యం పెంచుకుని వారిని ఉత్తేజపరిచారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలని ఆయన సూచించారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడటంతో పాటు ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. సేవాలాల్ మహారాజ్ బోధించిన సేవాభావం, ఐక్యత, సమానత్వం వంటి విలువలను యువత ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.సేవాలాల్ మహారాజ్ ఆశయాలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న ఇలాంటి క్రీడా కార్యక్రమాలు యువతలో స్ఫూర్తి నింపుతాయని, సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా తీర్చిదిద్దుతాయని ఎమ్మెల్యే తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన యువ క్రీడాకారులకు అభినందనలు తెలియజేసి, టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, స్థానిక అధికారులు, క్రీడాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రంగారెడ్డి గూడా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ఘన ప్రారంభం...

పేదల గృహ స్వప్నానికి రూపం ఇచ్చిన ప్రభుత్వం...



జడ్చర్ల//ఫిబ్రవరి 13 **ఆకాంక్ష :** రాజాపూర్ మండల పరిధిలోని రంగారెడ్డి గూడా గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనంపల్లి అనిరుధ్ రెడ్డి చేతుల మీదుగా ఇండ్ల ప్రారంభోత్సవం జరిగింది. గ్రామ ప్రజలు, లబ్ధిదారులు, స్థానిక నాయకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకను ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి లబ్ధిదారులకు ఇండ్ల తాళాలు అందజేశారు. ప్రభుత్వం పేదల పట్ల ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన నిరుపేద కుటుంబానికి పక్కా ఇల్లు అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద ప్రజలకు సురక్షితమైన, శాశ్వత నివాస వసతి కల్పించ బడుతోందని ఎమ్మెల్యే అన్నారు. ఇంత కాలం తాత్కాలిక గుడిసెల్లో జీవనం సాగించిన కుటుంబాలకు ఇప్పుడు శాశ్వత నివాసం లభించడం ఎంతో ఆనందకరమని ఆయన పేర్కొన్నారు. గృహం అనేది ప్రతి కుటుంబానికి ఒక ప్రాథమిక హక్కు అని, ఆ హక్కును అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.గ్రామ అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన వివరించారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులను గ్రామాల్లో మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లతో పాటు గ్రామాల్లో సామాజిక మౌలిక వసతులు కూడా పెంపొందించబడుతున్నాయని పేర్కొన్నారు.రంగారెడ్డి గూడా గ్రామంలో నిర్మించిన ఇండ్ల నిర్మాణం నాణ్యతా ప్రమాణాలతో జరిగిందని అధికారులు తెలిపారు. ప్రతి ఇంటిలో అవసరమైన గదులు, శౌచాలయం, తాగునీటి సౌకర్యం కల్పించబడినట్లు చెప్పారు. లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం తమ జీవితాల్లో వెలుగు నింపిందని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు మాట్లాడుతూ, పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. ఇంతకాలం ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఇప్పుడు గృహ సౌకర్యం లభించడం గొప్ప విషయమని పేర్కొన్నారు.మహిళలు ప్రత్యేకంగా ఆనందం వ్యక్తం చేస్తూ, తమ పిల్లల భవిష్యత్తు ఇప్పుడు సురక్షితంగా ఉందని చెప్పారు. వర్షాలు, గాలులకు భయపడకుండా ఇప్పుడు ప్రశాంతంగా జీవించగలమని తెలిపారు.ప్రభుత్వానికి మరియు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం గ్రామీణ ప్రాంతాల్లో పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని అధికారులు పేర్కొన్నారు. గ్రామాల్లో స్థిర నివాస వసతి కల్పించడం ద్వారా ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించే దిశగా పని చేస్తామని తెలిపారు.

# ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు....

విద్యతోనే సామాజిక గుర్తింపు సాధ్యం...

ప్రిన్సిపాల్ జి. మాధవి...




నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 13 **ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి జి. వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే ప్రతి విద్యార్థి 100 శాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నదని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు పుస్తకాలు, వస్త్రాలతో కూడిన కిట్లు అందించే యోచనలో ఉందని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా పరిశీలనలో ఉంచినట్లు వెల్లడించారు. కళాశాల ప్రిన్సిపాల్ జి. మాధవి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ, ఈ కళాశాలలో చదివే ప్రతి విద్యార్థి ఉన్నత స్థితికి చేరేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి సహకరించాలని పేర్కొన్నారు. విద్యను ఉపాధి దిశగా అభ్యసించాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. విద్యతోనే సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందవచ్చని విద్యార్థులకు ఆమె స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక పథకాలను అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమం ముగింపు సందర్భంగా సామూహిక భోజనాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లెక్చరర్లు ఈ. రవిప్రకాష్, హరిత, మహమ్మద్ యూనుస్, మంజుల, రాజేశ్వర్, సత్యం, శిరీష, నరేందర్ గౌడ్, నాగరాజు, రాజశేఖర్, హిఫ్సా, రాజయ్య, తుకారాం, సిద్ధికి, కిరణ్, కృష్ణయ్య తదితరులు, కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్‌డీపీఎస్ కేసులో నిందితుడికి 5 సంవత్సరాల జైలు శిక్ష...

పెద్దపల్లి//ఫిబ్రవరి 13 **ఆకాంక్ష :** పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రామగిరి పోలీస్ స్టేషన్ నమోదు చేసిన ఎన్‌డీపీఎస్ కేసులో నిందితుడికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడు మాలోత్ మణికాంత్‌కు 5 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ పెద్దపల్లి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు గౌరవ న్యాయమూర్తి శ్రీమతి కె. సునీత తీర్పు ఇచ్చారు.వివరాల్లోకి వెళితే, 2020 అక్టోబర్ 3వ తేదీ ఉదయం రామగిరి పోలీసులకు అందిన నమ్మదగిన సమాచారంతో పోలీసులు పన్నూర్ గ్రామ పరిసర ప్రాంతంలో జేఎన్‌టీయూఐ కళాశాల సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో డ్రై గంజాయి లభించింది. విచారణలో అతడు మాలోత్ మణికాంత్‌గా గుర్తించారు. అతను గత సంవత్సరం కాలంగా తెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి అవసరమైన వారికి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడించాడు. అదేవిధంగా 1500 గ్రాముల డ్రై గంజాయిని ఆదిలాబాద్ ప్రాంతం నుంచి కొనుగోలు చేసి విక్రయించేందుకు తీసుకువచ్చినట్లు తెలిపాడు.ఈ ఘటనపై ఎన్‌డీపీఎస్ చట్టం సెక్షన్ 8(ఎ) తీ/ష 20(ఎ)(అఅ)(డీ) కింద కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవి వాదనలు వినిపించగా, లైజన్ అధికారిగా పి. కోటేశ్వరరావు, సాక్ష్యాధారాల సమర్పణలో సీడీవో ఎస్.కే. షహబాజ్ తదితరులు కీలక పాత్ర పోషించారు.నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా కృషి చేసిన పోలీస్ మరియు ప్రాసిక్యూషన్ సిబ్బందిని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

## పాలెం గ్రామంలో 15న శివపార్వతుల కళ్యాణం...



నాగర్‌కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 13 **ఆకాంక్ష :** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పరిధిలోని పాలెం గ్రామంలో వెలిసిన శ్రీ అలర్మేల్ మంగ సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయానికి అనుసంధానం ఉన్న శివాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 15న ఆదివారం సాయంత్రం 7 గంటలకు వేదమూర్తులచే శాస్త్రోక్తంగా శివపార్వతుల కళ్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మనుసాని విష్ణుమూర్తి, కార్యనిర్వహణ అధికారి సిహెచ్ రంగారావు తెలిపారు. శివరాత్రి సందర్భంగా తెల్లవారుజాము నుండి లింగోద్భవం వరకు శివాభిషేకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభిషేకం చేసిన భక్తులకు స్ఫటిక లింగం, దర్శనానికి వచ్చిన ప్రతి భక్తునికి రుద్రాక్ష పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు. వివరాలకు సెల్: 7981707326 ను సంప్రదించవచ్చు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ టాలెంట్ టెస్ట్ పేపర్ విడుదల...




నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 13 **ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఎస్ఎస్‌సీ టాలెంట్ టెస్ట్ పరీక్ష పేపర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. తారా సింగ్ మాట్లాడుతూ ఈ టాలెంట్ టెస్ట్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని, విద్యారంగ సమస్యలపై పోరాటాలతో పాటు విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యమని తెలిపారు. ప్రముఖ విద్యావేత్తలు చుక్కా రామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్‌లు ఈ ప్రశ్నాపత్రాన్ని సిద్ధం చేసినట్లు వెల్లడించారు.పదవ తరగతి విద్యార్థులు బోర్డు పరీక్షల భయానికి గురికాకుండా మనోధైర్యం కలిగించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు టాప్ టెన్‌లో నిలిచిన వారికి ప్రత్యేక పురస్కారాలు అందజేస్తామని చెప్పారు. మండలం, తాలూకా, పాఠశాల స్థాయిల్లో కూడా ప్రథమ బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కో-కన్వీనర్ రజిత, జిల్లా నాయకులు వంశీ, శివప్రసాద్, వినయ్ ప్రసాద్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి బీసీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కె. ప్రసూన



వెల్దుర్తి//ఫిబ్రవరి 13 **ఆకాంక్ష :** కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం అయిన వెల్దుర్తి మండల కేంద్రం లోని బీసీ బాలికల వసతి గృహాన్ని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహానికి చెందిన పదవ తరగతి విద్యార్థినులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటాలని సూచించారు. గత సంవత్సరం సాధించిన మార్కులను దాటేలా కృషి చేయాలని విద్యార్థినులకు ప్రోత్సాహం అందిస్తూ, పరీక్షల్లో విజయం సాధించేందుకు అవసరమైన అవగాహన కల్పించారు.తనిఖీ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, కిచెన్, విద్యార్థినుల విశ్రాంతి గదులు, వాష్‌రూమ్స్, స్టడీ రూమ్స్ మరియు హాస్టల్ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. వసతి గృహం చాలా పరిశుభ్రంగా నిర్వహిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు.వసతి గృహాన్ని శుభ్రంగా తీర్చిదిద్దుతూ, పరిశుభ్రతను పాటిస్తూ విద్యార్థినుల ఉత్తమ ఫలితాల కోసం కృషి చేస్తున్న వసతి గృహ అధికారిణి గిరిజా దేవి ని కే. ప్రసూన ప్రశంసించారు.

## బ్రహ్మగుండేశ్వర ఆలయం ప్రధాన ముఖద్వారానికి నూతన టేకు తలుపులు....

దాతల సేవతో వైభవంగా ప్రారంభం

బ్రహ్మగుండ ఆలయ ప్రధాన ముఖద్వారానికి నూతన తలుపులు



వెల్దుర్తి //ఫిబ్రవరి 13 **ఆకాంక్ష :** కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం అయిన వెల్దుర్తి మండలం సమీపాన గల బ్రహ్మగుండ క్షేత్రం గల ప్రసిద్ధ బ్రహ్మగుండేశ్వర ఆలయ ప్రధాన ముఖద్వారానికి దాతల సహకారంతో నూతన తలుపులను అమర్చి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి తోడ్పడిన దాతలు శ్రీమతి వాణిశ్రీ,టి.ఈ. మాధవ కృష్ణా గౌడ్ దంపతులు మరియు శ్రీమతి జానకి,పార్థసారథి గౌడ్ దంపతులు కలిసి రూ.2.30 లక్షల వ్యయంతో కూడిన టేకు చెక్కతో ప్రత్యేక నమూనాలతో ముఖ ద్వారం తలుపులను తయారు చేయించి అమర్చినారు.ఆలయ ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఆలయ ఈవో ఆంజనేయులు మరియు సింగిల్ విండో చైర్మన్ బొమ్మనా రమాకాంత్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యుడు బొమ్మన రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ తలుపులను ముఖ ద్వారమునకు అమర్చినారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, దాతలను ఆలయ కమిటీ సభ్యులు పూలమాల శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా ఈ.వో. ఆంజనేయులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి భక్తులు ముందుకు రావడం హర్షణీయమని, దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి దినదినాభివృద్ధి చెందుతుందని తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ రమాకాంత్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు బొమ్మన రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ భక్తుల సహకారం వల్ల ఆలయంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అంతేకాకుండా దాతలు మాట్లాడుతూ తమ వంతుగా ఆలయానికి సేవ చేయడం ఆనందంగా ఉందని భక్తులందరూ ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మగుండ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వెల్దుర్తి సీఐ యుగంధర్ దంపతులు.



వెల్దుర్తి//ఫిబ్రవరి 13 **ఆకాంక్ష :** కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం వెల్దుర్తి మండలంలో శుక్రవారం రోజున బ్రహ్మగుండ క్షేత్రంలో వెల్దుర్తి సీఐ యుగంధర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడాయి. వేదమంత్రాల నడుమ జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులను ఆకట్టుకుంది.ఈ సందర్భంగా ఆలయ ఈవో ఆంజనేయులు, ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకుడు శేఖర్ రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ రమాకాంత్ రెడ్డి సీఐ దంపతులకు స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించి దేవుని ఆశీర్వాదాలు అందజేశారు.పూజల అనంతరం ఆలయ ప్రతినిధులు దేవుని చిత్రపటాన్ని సీఐ యుగంధర్ దంపతులకు స్మారకంగా అందించారు. వారు ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## పి.ఎం. శ్రీ ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (గర్ల్స్) వెల్దుర్తి లో రెండు రోజుల ఏటీఎల్ వర్క్‌షాప్ విజయవంతం.



వెల్దుర్తి //ఫిబ్రవరి 13 **ఆకాంక్ష :** కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గమైన వెల్దుర్తి ఏపీ ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ ( గర్ల్స్) లో, సివిట్రానిక్స్ కంపెనీ సహకారంతో రెండు రోజుల పాటు అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటిఎల్) వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ వర్క్‌షాప్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచన మరియు సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, సాంకేతిక నిపుణుల మార్గదర్శకత్వంలో మొత్తం 10 ప్రాజెక్టులను రూపొందించారు. ప్రాక్టికల్ పద్ధతిలో నిర్వహించిన శిక్షణ ద్వారా విద్యార్థులు సమస్య పరిష్కార నైపుణ్యాలు మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పై ప్రత్యక్ష అనుభవాన్ని పొందారు.అవుట్‌రీచ్ కార్యక్రమం భాగంగా, మా పాఠశాల విద్యార్థులతో పాటు కేజీబీవీ వెల్దుర్తి పాఠశాల విద్యార్థులు కూడా అట్ల్ ల్యాబ్‌ను సందర్శించి, రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించారు.ప్రాజెక్టుల వెనుక ఉన్న సూత్రాలను తెలుసుకుంటూ విద్యార్థులు ఆవిష్కరణల పట్ల ఆసక్తిని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి జి. లక్ష్మీ ప్రసన్న, ఉప ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి బి. సునీత, అట్ల్ ఇన్‌చార్జ్ శ్రీమతి ఎం. హరిత, సాంకేతిక మెంటర్లు శ్రీ ప్రణీత్, శ్రీమతి నాగవేణి, శ్రీమతి షైనాజ్ బాను పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.పాఠశాల నిర్వహణ వర్గం సివిట్రానిక్స్ కంపెనీ సహకారాన్ని అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం మరియు సృజనాత్మకతను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమం విద్యార్థుల ప్రాజెక్టుల ప్రదర్శనతో విజయవంతంగా ముగిసింది.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com